


www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 03-11-2022 సంపుటి : 04 సంచిక : 65 పేజీలు : 4 వెల : రూ 3-00


## మునుగోడు ఉపఎన్నిక..
# పోలింగ్‌కు సర్వంసిద్ధం




చండూరు: మునుగోడు ఉపఎన్నికకు సర్వం సిద్ధమైంది. ఉపఎన్నిక పోలింగ్‌కు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రమైన చండూరులోని డాన్‌బోస్కో కాలేజీకి సిబ్బంది చేరుకున్నారు. గ్రామాల వారీగా సిబ్బందికి ఎన్నికల సామాగ్రి అధికారులు పంపిణీ చేస్తున్నారు. సామాగ్రి తీసుకున్న సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలి వెళు_న్నారు.మునుగోడు నియోజకవర్గంలో రేపు ఉదయం 7 గంటలకు ఉపఎన్నిక పోలింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ కొనసాగనుంది. నియోజకవర్గంలో మొత్తం 2,41,855 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,21,720 మంది పురుషులు, 1,20,128 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ఈ నెల 6న ఓట్లను లెక్కించనున్నారు. వచ్చే సాధారణ ఎన్నికలకు సెమీఫైనల్‌గా భావిస్తున్న ఈ ఉపఎన్నికను పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. అధికార టీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి బరిలో నిలిచారు.

# ప్రధాని మోదీ, సీఎం జగన్ విశాఖ పర్యటన ఖరారు.. షెడ్యూల్ ఇదే!

విశాఖపట్నం: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడోసారి విశాఖ పర్యటన దాదాపు ఖరారైంది. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి పలు కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో ఆయా విభాగాల అధికారులు తలమునకలయ్యారు. దాదాపు 14 ప్రాజెక్టులు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటివరకు రూ.10,842.47 కోట్లతో చేపట్టిన, చేపట్టబోతున్న 8 ప్రాజెక్టులకు ప్రధాని కార్యాలయం నుంచి అంగీకారం లభించింది. రెండు మూడు రోజుల్లో మిగిలిన వాటికి కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే అవకాశాలున్నాయి. ఈ నెల 11న విశాఖకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా అదే రోజు మధ్యాహ్నం విశాఖకు చేరుకుంటారు. ఆ రోజు సాయంత్రం ఐఎన్ఎస్ డేగాకు చేరుకోనున్న ప్రధాని మోదీని ముఖ్యమంత్రి స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి నేరుగా తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రానికి చేరుకుని ఐఎన్ఎస్ చోళలో రాత్రి బస చేస్తారు. 12వ తేదీ ఉదయం ఏయూ గ్రౌండ్స్‌కు చేరుకుని.. అక్కడి నుంచే భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు.సుమారు

### ప్రధాని మోదీ, సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభం, శంకుస్థాపనలు
### ఐఎన్ఎస్ చోళలో బసకు ఏర్పాట్లు చేస్తున్న తూర్పునౌకాదళం
### రెండు రోజుల్లో హెచ్‌పీసీఎల్ ప్రాజెక్ట్, ఐఐఎంవీకు కూడా గ్రీన్‌సిగ్నల్



14 ప్రాజెక్టులను ప్రధాని చేతుల మీదుగా వర్చువల్ విధానంలో ప్రారంభం, శంకుస్థాపనలు జరగనున్నాయి. కొన్ని ప్రభుత్వ సంస్థలు ఆలస్యంగా జాబితా పంపించడంతో అవి ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో)లో పరిశీలనలో ఉన్నాయి. అవి కూడా త్వరలోనే షెడ్యూల్‌లోకి వచ్చే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు 8 ప్రాజెక్టులకు అంగీకరించినట్లు పీఎంవో వర్గాలు వెల్లడించాయి. ఇందులో రైల్వే శాఖకు సంబంధించి రెండు, ఫిషరీస్‌కు చెందిన ఒకటి, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్‌కు చెందినవి 3, పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మినిస్ట్రీకి చెందిన 2 ప్రాజెక్టులున్నాయి.?రూ.460 కోట్లతో విశాఖపట్నం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులతో పాటు రూ.100.47 కోట్లతో సౌత్ కోస్టల్ రైల్వే జోన్ హెడ్‌క్వార్టర్స్ భవనానికి శంకుస్థాపన.
రూ.152 కోట్లతో విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ, అప్‌గ్రేడేషన్ పనులకు పునాది రాయి..
రూ.3,778 కోట్లతో ఏపీ సెక్షన్‌కు చెందిన రాయ్‌పూర్–విశాఖపట్నం ఎకనమిక్ కారిడార్ ఆరులైన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం పనులకు శంకుస్థాపన.
రూ.566 కోట్లతో కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్ వరకు పోర్టు వాహనాల రాకపోకలకు ప్రత్యేక రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన.
గెయిల్ సంస్థకు సంబంధించి రూ.2,658 కోట్లతో 321 కిలోమీటర్ల పొడవునా శ్రీకాకుళం నుంచి అంగూల్ పైప్‌లైన్ (ఎస్ఏపీఎల్) ప్రాజెక్టుకు శంకుస్థాపన.
ఈస్ట్రన్ ఆఫ్‌షోర్‌లో రూ.2,917 కోట్లతో ఓఎన్‌జీసీకి సంబంధించి యూ ఫీల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి ప్రధాని మోదీ, సీఎం వైఎస్ జగన్ జాతికి అంకితం చేయనున్నారు.
వీటితో పాటుగా సుమారు రూ.26 వేల కోట్లతో హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్(హెచ్‌పీసీఎల్) చేపట్టిన రిఫైనరీ విస్తరణ ప్రాజెక్టు, గంభీరంలో రూ.445 కోట్లతో మొదటి విడతలో నిర్మించిన ఐఐఎంవీ భవనం, రూ.260 కోట్లతో వడ్లపూడిలో నిర్మించిన వ్యాగన్ వర్క్‌షాప్‌ను కూడా ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించే అవకాశాలున్నాయి. రూ.380 కోట్లతో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి, భోగాపురం ఎయిర్‌పోర్టుకు కూడా శంకుస్థాపన చేసే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

# ఏ లక్ష్యం లేకుండా దిగజారిపోతున్న వ్యక్తి పవన్ కల్యాణ్: మంత్రి రోజా



గుంటూరు: లక్ష్యంతో ముందుకు వెళ్తున్న వ్యక్తి జగన్ అయితే లక్ష్యం లేకుండా పవన్ కల్యాణ్ దిగజారి పోతున్నాడని ఎద్దేవా చేశారు మంత్రి రోజా.బుధవారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా చదువు ఒక్కటే ముఖ్యం కాదని.. క్రీడలు కూడా ముఖ్యమేనన్నారు మంత్రి రోజా. క్రి?డల వల్ల ఆరోగ్యం, ఆనందం వస్తుందన్నారు. ఎన్ని కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు, ఎంత మంది నిందించినా విజయం ద్వారా సమాధానం చెప్పాలని సూచించారు. క్రీడల?లో పాల్గొనటం ద్వారా దేశం తరుపున ఆడే గొప్ప అవకాశం లభిస్తుందని, అందుకోసం కృషి చేయాలని చెప్పారు.'నేను ఎన్నో అవమానాలు ఎదురైన వెనుదిరగకుండా ముందుకు వెళ్ళాను. ఆట ఏది అయిన మన లక్ష్యం సెక్సెస్‌పై మాత్రమే ఉండాలి. సీఎం వైఎస్ జగన్ చూసినన్ని అవమానాలు ఎవరు చూసి ఉండరు. కానీ 151 సీట్లల్లో విజయంతో అందరికి సమాధానం చెప్పారు. లక్ష్యంతో ముందుకు వెళ్తున్న వ్యక్తి జగన్ అయితే లక్ష్యం లేకుండా దిగజారి పోతున్న వ్యక్తి పవన్ కల్యాణ్. హ్యాండ్ బాల్ ఆడే 22 మంది మెరికలాంటి యువకులకు శాప్ తరుపున అన్నివిధాల శిక్షణ ఇస్తున్నాము. శాప్‌కి సపోర్ట్ చేస్తున్న స్పాన్సర్లకు కృతజ్ఞతలు. ' అని తెలిపారు మంత్రి రోజా.క్రీడల్లో కష్టపడుతున్న ఆటగాళ్లకు ప్రభుత్వం తరపున ప్రోత్సాహం ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు మంత్రి రోజా. రాబోయే సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజు సందర్భంగా 'జగనన్న క్రీడా సంబరాలు' పేరుతో రూ.50 లక్షల నగదు బహుమతితో క్రీడా పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర క్రీడాకారులు పట్టుదలతో నేషనల్ నుంచి ఒలింపిక్స్ వరకు వెళ్లాలని, క్రీడల్లో కష్టపడితే ఉద్యోగ అవకాశాలు కూడా ఉంటాయి తెలిపారు.

# బీసీల మోస చరిత్రకుగానూ టీడీపీకి మళ్లీ ఓటమే!: ఎంపీ విజయసాయిరెడ్డి



అమరావతి: పాలనా రాజధాని విశాఖకు అడ్డుపడుతూ.. ఉత్తరాంధ్రకు తీరని ద్రోహం తలపెడుతున్న టీడీపీపై అక్కడి ప్రజాగ్రహం పెల్లుబిక్కుతోంది. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ రాజ్యసభ ఎంపీ విజయసాయిరెడ్డి.. టీడీపీ సీనియర్ నేతకు ట్విట్టర్ ద్వారా చురకలంటించారు. ఉత్తరాంధ్రలో టీడీపీ ఒక్క అసెంబ్లీ, లోక్‌సభ స్థానం కూడా గెలవకుండా చేయడానికి నీలాంటి ఒక్కడు చాలు అచ్చం అని వ్యంగ్యం ప్రదర్శించారు విజయసాయిరెడ్డి. 'టెక్కలిలో నీ 'టెంకాయ' ఈసారి ఎలాగూ ముక్కలు అవుతుంది. పాలనా రాజధానిగా వైజాగ్ కాకుండా భ్రమరావతి రియల్ ఎస్టేట్ మాఫియాకు దళారిలా మాట్లాడుతున్నావ్. చరిత్ర హీనుడిగా మిగిలిపోతావ్' అంటూ విమర్శ గుప్పించారు. ఉత్తరాంధ్రలో టీడీపీకి ఒక్క అసెంబ్లీ, లోక్ సభ స్థానం కూడా గెలవకుండా చేయడానికి నీలాంటి ఒక్కడు చాలు అచ్చం. టెక్కలిలో నీ 'టెంకాయ' ఈసారి ఎలాగూ ముక్కలవుతుంది. పాలనా రాజధానిగా వైజాగ్ కాకుండా భ్రమరావతి రియల్ ఎస్టేట్ మాఫియాకు దళారిలా మాట్లాడుతున్నావు. చరిత్ర హీనుడిగా మిగిలిపోతావు.బీసీలు జడ్జిలుగా పనికిరారని కొలీజియానికి లేఖ రాశావే చంద్రం! చెప్పులు మోసేవారిని అందలమెక్కించావు తప్ప పేదలను మనుషులుగా చూశావా? జనాభా ప్రాతిపదికన బీసీలకు ప్రాతినిధ్యం కల్పించిన చరిత్ర జగన్ గారిది. 'వెన్నుపోటు' మాత్రమే తెలిసినవాడివి. బ్యాక్ బోన్ కులాల గురించి నీకెందుకు బాబూ? అంటూ టీడీపీ అధినేత, ప్రతిపక్ష నేతకు చురకలు అంటించారు. గంజాయి పాత్రుడు, బొల్లి రవీంద్ర, మల మల రాముడు, బండ సత్తిలకు కళ్లు నెత్తికెక్కితే బీసీల స్థితిగతులు మారినట్టా చంద్రం? వీళ్లను అడ్డం పెట్టుకుని బిసిలను మోసం చేశావు. నీ 14 ఏళ్ల పాలనలో బీసీలను నానా రకాలుగా అవమానించినందుకే వారు గుణపాఠం నేర్పారు.

# అమరావతి పాదయాత్రపై ఏపీ హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

అమరావతి: అమరావతి పాదయాత్రపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. పాదయాత్రలో ముందు రైతులున్నప్పటికీ వెనుక వేరేవాళ్లు ఉన్నారని కోర్టు వ్యాఖ్యానించింది.పాదయాత్ర ద్వారా కోర్టులపైనా ఒత్తిడి తెస్తారా? అంటూ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అమరావతి పాదయాత్ర రాజకీయ యాత్ర. పిటిషన్‌లో పార్టీ కానివారు అప్పీల్ ఎలా దాఖలు చేస్తారంటూ రాజధాని రైతు పరిరక్షణ సమితిని హైకోర్టు ప్రశ్నించింది.రాజధాని రైతు పరిరక్షణ సమితి దాఖలు చేసిన పిటిషన్ విచారణ అర్హతపై అభ్యంతరం లేవనెత్తిన రాష్ట్ర ప్రభుత్వం.. సవివరంగా కౌంటర్ దాఖలు చేస్తామని ధర్మాసనానికి తెలిపింది. దీంతో తదుపరి విచారణను కోర్టు సోమవారానికి వాయిదా వేసింది.



# నిపుణులు ఎంత చెప్పినా చంద్రబాబు వినలేదు: స్పీకర్ తమ్మినేని

శ్రీకాకుళం: వికేంద్రీకరణతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమని ఏపీ అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం అభిప్రాయపడ్డారు.భావితరాల కోసమే ఉత్తరాంధ్ర ప్రజల పోరాటం నడుస్తోందని ఆయన అన్నారు. 'అమరావతి రాజధానికి అనువైన ప్రాంతం కాదు. నిపుణులు ఎంత చెప్పినా.. చంద్రబాబు పట్టించుకోలేద'ని తమ్మినేని మండిపడ్డారు.జిల్లా ఆముదాలవలసలో

నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ భేటీలో స్పీకర్ తమ్మినేని సీతారాంతో పాటు, మేధావులు, ప్రజాసంఘాల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అభివృద్ధి వికేంద్రీకరణతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యమని జేఏసీ ప్రతినిధులు అన్నారు. రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. విద్య, వైద్య రంగాల్లో ఎనలేని పురోగతి ఉంటుందన్నారు. విశాఖను రాజధాని చేస్తే పరిశ్రమలు, ఐటీ కంపెనీలు వస్తాయన్నారు.

# రష్యాకు ఎదురుదెబ్బ...

### ఉక్రెయిన్ దాడిలో వెయ్యి మంది సైనికులు మృతి



మాస్కో: రష్యాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఉక్రెయిన్ మిలిటరీ దాడిలో వెయ్యి మంది రష్యా సైనికులు మరణించారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి దిగిన తర్వాత రష్యా మరోసారి ఇంత పెద్ద సంఖ్యలో సైనికులను కోల్పోయింది. సైన్యంలోకి కొత్తగా రిక్రూట్ చేసుకున్న సైనికులను సరిహద్దుల వద్దకు రష్యా తరలించింది. అయితే కనీస ఆయుధాలు కూడా లేని రష్యా సైనికులపై ఉక్రెయిన్ దళాలు దాడి చేశాయి. దీంతో గత 24 గంటల్లో వెయ్యి మందికిపైగా రష్యా సైనికులు మరణించినట్లు ఉక్రెయిన్ రక్షణ మంత్రి తెలిపారు. ఇప్పటి వరకు 71,200 మంది రష్యా సైనికులు చనిపోయినట్లు పేర్కొన్నారు.మరోవైపు ఉక్రెయిన్‌పై దాడులను తీవ్రం చేసేందుకు రష్యా ప్రయత్నిస్తున్నది. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ నుంచి గోధుమల రవాణా కోసం ఐక్యరాజ్య సమితి (ఐరాస)తో చేసుకున్న ఒప్పందాన్ని రష్యా బ్రేక్ చేసింది. గోధుమలు ఎగుమతి చేసే కారిడార్‌ను రష్యాపై దాడుల కోసం ఉక్రెయిన్ వినియోగిస్తున్నదని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో యూఎన్, టర్కీతో చేసుకున్న ఒప్పందం నుంచి తప్పుకుంటున్నట్లు ఇటీవల వెల్లడించారు.

# సంపాదకీయం

గురువారం 03-11-2022

## గవర్నర్లు వర్సెస్ రాష్ట్రాలు....

గవర్నర్లు మంత్రులను తొలగించగలరా? ఒక మంత్రిని తొలగించాలంటూ కేరళ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ ముఖ్యమంత్రిని కోరడం సంచలనం సృష్టించింది. బిజెపియేతర పార్టీల పాలనలోని రాష్ట్రాల గవర్నర్లు రానురాను సమాంతర పాలకులు అయిపోతున్నారు. బిల్లులను నిరవధికంగా తమ వద్ద వుంచుకొని పాలనకు ఆటంకాలు కలిగిస్తున్నారు. విశ్వవిద్యాలయాల నిర్వహణలో మితిమించి జోక్యం చేసుకొంటున్నారు. బిజెపియేతర రాష్ట్రాల గవర్నర్లు మాత్రమే ఇటువంటి అప్రతిష్ఠాకరమైన ప్రవర్తనకు తరచూ పాల్పడుతున్నారు. అంటే తాము కేంద్ర పాలకుల ఏజెంట్లు మాత్రమేనని వారిని మెప్పించడానికి ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులను, వారి ప్రభుత్వాలను ముప్పితిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించడమే తమ కర్తవ్యమని వీరు భావిస్తున్నట్టున్నారు. తాము ప్రజలెన్నుకున్న గవర్నర్లు కాదు అని గ్రహించడం లేదు. ప్రజలెన్నుకున్న రాష్ట్ర మంత్రి వర్గాల సలహా మేరకే తాము పని చేయాల్సి వుంటుందనే రాజ్యాంగ పరిమితిని గుర్తించడం లేదు. ముఖ్యమంత్రులకు శాసన సభలో మెజారిటీ వున్నంత కాలం వారి సలహాలు పాటిస్తూ, వారికి తోడ్పడడమే మంచి గవర్నర్ లక్షణమని వీరికి ఎవరు చెప్పాలి? మంత్రులను తొలగించే స్వతంత్రాధికారం తనకున్నదని కేరళ గవర్నర్ చెప్పడం రాజ్‌భవన్‌ల అతిక్రమణ పర్వంలో పరాకాష్ఠ. విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల ఎంపిక కమిటీ సభ్యుల నియామక నిబంధనలను మారుస్తూ గత సెప్టెంబర్‌లో కేరళ శాసన సభ ఆమోదించిన ఒక బిల్లు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య మరొక సారి తీవ్ర విభేదాలు తలెత్తినట్టు తెలుస్తున్నది. ఆ రాష్ట్ర ఆర్థిక మంత్రి కెఎన్ బాల గోపాల్ కేరళ విశ్వవిద్యాలయ సభలో ఇటీవల మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని యూనివర్శిటీలతో ఎక్కువ పరిచయమున్న వారు కేరళ వర్శిటీల ప్రజాస్వామిక శైలిని అర్థం చేసుకోలేరని గవర్నర్‌ను ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్య చేశారు. దీనితో మండిపడిన గవర్నర్ ఆ మంత్రి తన ఆమోదాన్ని కోల్పోయారని ప్రకటించారు. అతనిని మంత్రి పదవి నుంచి తొలగించాలని ముఖ్యమంత్రిని కోరారు. సిఎం పినరయి విజయన్ దీనిని తిరస్కరించారు, తీవ్రంగా ఖండించారు. మంత్రులను నియమించడం, తొలగించడం కేవలం ముఖ్యమంత్రికే పరిమితమైన రాజ్యాంగ అధికారమని ఆయన గవర్నర్‌కు స్పష్టం చేశారు. మంత్రి బాలగోపాల్ కేరళ విశ్వవిద్యాలయంలో చేసిన వ్యాఖ్యలు ప్రాంతీయ ద్వేషాలను రెచ్చగొట్టేవిగా వున్నాయని గవర్నర్ అభిప్రాయపడ్డారు. ఇది మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు తన ద్వారా బాలగోపాల్ చేసిన ప్రతిజ్ఞను ఉల్లంఘించడమేనని అన్నారు. వాస్తవానికి రాజ్యాంగం 164 అధికరణ ప్రకారం ముఖ్యమంత్రిని, సిఎం సిఫార్సు మేరకు మంత్రులను గవర్నరే నియమిస్తారు. గవర్నర్ సంతృప్తి, ఆమోదానికి లోబడి మంత్రులు కొనసాగుతారు. అయితే ఇది మంత్రులను తొలగించే అధికారం గవర్నర్‌కు ఎంత మాత్రం కట్టబెట్టదు. గవర్నర్ సంతృప్తి, ఆమోదం అనేవి స్వతంత్రమైనవి కావు. అవి ప్రజల మద్దతుతో ఏర్పడిన మంత్రి వర్గం సిఫారసుకు లోబడినవి మాత్రమే. మంత్రులను గవర్నరే నేరుగా తొలగిస్తే రాష్ట్రాల్లోని ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు ఇంక ఉనికి ఎక్కడుంటుంది? ఇది ప్రజాస్వామ్య రాజ్యాంగ ఉల్లంఘన కిందికే వస్తుంది. ఈ విషయాన్ని మరిచిపోయి ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ గీత దాటారు. మిమ్మల్ని ఎందుకు తొలగించరాదో చెప్పాలంటూ 11 విశ్వవిద్యాలయాల విసిలకు నిర్ణీత వ్యవధితో కూడుకొన్న నోటీసులను పంపించి కేరళ గవర్నర్ మరో సంచలనం సృష్టించారు. యుజిసి నియమాలకు విరుద్ధంగా నియమితులయ్యారన్న కారణం చూపి కేరళలోని మరో విశ్వవిద్యాలయం విసి నియామకాన్ని సుప్రీంకోర్టు ఇటీవల రద్దు చేసింది. ఆ సందర్భంగా అది ఇచ్చిన తీర్పును ఆసరా చేసుకొని 11 మంది విసిలకు గవర్నర్ ఖాన్ ఈ నోటీసులు పంపించారు. బిల్లుల విషయంలో తెలంగాణ గవర్నర్ తమిళి సై కూడా తాత్సార తంత్రాన్ని పాటించడం బాధాకరం. తెలంగాణ శాసన సభ ఆమోదించి పంపిన 8 బిల్లులపై ఆమోద ముద్ర వేయకుండా వాటిని గవర్నర్ తమిళి సై తన వద్ద వుంచుకున్నారు. ఈ ఎనిమిది బిల్లులలో ఆరు సవరణ బిల్లులు కాగా, రెండు కొత్తవి. వీటిని ఆమోదించడం, తిరస్కరించడం తన ఇష్టాయిష్టాలపై ఆధారపడి వుంటుందని ఆమె ప్రకటించారు. వాస్తవానికి అసెంబ్లీ పంపిన బిల్లులన్నింటిపై ఆమోద ముద్ర వేయడం గవర్నర్ల విధి. తమకేమైనా అభ్యంతరాలుంటే వాటిని తెలియజేయాలే తప్ప బిల్లును నిరవధికంగా తమ వద్ద వుంచుకోడం రాజ్యాంగ విహితం కాదు. కొన్ని సందర్భాల్లో రాష్ట్రపతి ఆమోదానికి సిఫార్సు చేస్తూ గవర్నర్లు రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందికి గురి చేస్తూ వుంటారు. ప్రజలు ఎన్నుకున్న శాసన సభలు పంపించే బిల్లులను గవర్నర్లు నిరవధికంగా వుంచుకోడం పూర్తిగా ప్రజాస్వామ్య విరుద్ధం. పద్ధతి తప్పినప్పుడే గవర్నర్లు ఇటువంటి నగుబాటు చర్యలకు పాల్పడుతుంటారు. వారిలో ఇప్పటికైనా విజ్ఞత కలగాలి.

# విభజన ప్రాజెక్టుల సంగతేంటీ..?

విజయవాడ, నవంబర్ 2, ప్రధానమంత్రి నరేంద్రమోదీ పూర్తి స్థాయిలో ఓ కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇటీవలి కాలంలో తొలి సారిగా ఏపీ పర్యటనకు వస్తున్నారు. విశాఖలో కొత్త రైల్వే స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. గతంలో మోదీ ఏపీ పర్యటనకు వస్తూంటే పెద్ద ఎత్తున నిరసనలు జరిగేవి. కానీ గత మూడేళ్లుగా ఆయన ఏపీకి వచ్చినా ఎలాంటి నిరసనలు లేవు. అదే సమయంలో ఏపీకి రావాల్సిన ప్రాజెక్టులు మాత్రం ఎక్కడివక్కడే ఉండిపోయాయి. అయినా ఏపీలోని రాజకీయ పార్టీలు ప్రశ్నించడం లేదు. ఇప్పుడు మరోసారి ఏపీకి వస్తున్నారు. మరి రాజకీయ పార్టీలు తమ రాష్ట్ర సమస్యలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తాయా ?ప్రధానమంత్రి నరేంద్రమోదీ విభజన హామీలు అమలు చేయలేదని.. ప్రత్యేకహోదా లాంటి హామీల విషయంలో మోసం చేశారని తెలుగుదేశం పార్టీ హయాంలో చివరి ఏడాది నిరసనలు చేపట్టారు. ఆయన ఏపీ పర్యటనకు వస్తే నల్ల బెలూన్లు ఎగురవేశారు. నిజానికి మోదీపై ఈ వ్యతిరేకత గతంలో తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లోనూ ఉండేది. ఇప్పుడు కూడా ఉంది. ఇప్పుడు అదనంగా తెలంగాణలో అలాంటి వ్యతిరేకతను టీఆర్ఎస్ పార్టీ వ్యక్తం చేస్తోంది. మోదీ వస్తున్నారు.. రాష్ట్రానికి ఏం ఇస్తారని అక్కడి పార్టీలు ప్రశ్నిస్తూ ఉంటాయి. అయితే ఇప్పుడు ఏపీలో మాత్రం ఎలాంటి నిరసనలు వ్యక్తం చేసే అవకాశం లేదు. భారతీయ జనతా పార్టీని టార్గెట్ చేసుకుని.. కేంద్రంపై పోరాడుతున్నామని ప్రజలకు చెప్పినా.. గత ఎన్నికల్లో ప్రజలు టీడీపీని ఆదరించలేదు. దీంతో బీజేపీతో విడిపోయి నష్టపోయామని టీడీపీ ఓ అంచనాకు వచ్చింది. అందుకే.. బీజేపీ విషయంలో సైలెంట్ అయిపోయింది. ప్రస్తుతం ఏపీలోని రాజకీయ పార్టీలన్నీ బీజేపీ విషయంలో సాఫ్ట్ గా వ్యవహరిస్తున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ కావడం ఒకటైతే.. ఏపీలో ఎలాంటి బలం లేకపోవడం కారణంగా టార్గెట్ చేయాల్సిన అవసరం లేదని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. అందుకే.. రాజకీయ పార్టీలు ప్రధాని మోదీ రాకను వ్యతిరేకించే అవకాశం లేదు. ఆయనను ప్రశ్నించే నేతలు కూడా ఉండకపోవచ్చు. రాజకీయంగా సరే.. మరి రాష్ట్ర ప్రయోజనాల కోసం ... కేంద్రం నుంచి రావాల్సిన వాటి కోసం ప్రశ్నించరా అనేది సామాన్యుల్లో వస్తున్న సందేహం. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిజానికి చేయాల్సింది రైల్వే స్టేషన్ శంకుస్థాపన కాదు.. రైల్వే జోన్ శంకుస్థాపన. గత ఎన్నికలకు ముందు జోన్ ప్రకటించారు కానీ అమలు కోసం ఇంత వరకూ ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. దీనిపై ఏపీ ప్రభుత్వం కూడా కేంద్రంపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావడం లేదు. రాజకీయంగా విమర్శలు.. ప్రతి విమర్శలు చేసుకుంటున్నారు కానీ అసలు విషయం మాత్రం ముందుకు పడటం లేదు. అదొక్కటే కాదు.. విభజన సమస్యలు మూడున్నరేళ్ల కిందట ఎలా ఉన్నాయో.. ఇప్పుడూ అలానే ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే అంతకు ముందు పోలవరం నిధులు ఎప్పటికప్పుడు రీఎంబర్స్ చేసేవారు. కానీ మూడున్నరేళ్లుగా నిధులు ఇవ్వకపోగా.. అంచనాలను భారీగా తగ్గించేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ సమస్య అలాగేఉంది. దీంతో పాటు పోలవరం భవితవ్యంపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఇక ప్రత్యేకహోదా అంశం అలాగే ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే టీడీపీ ప్రభుత్వం ఏ అంశాలపై పోరాడిందో వాటికేమీ పరిష్కారం లభించలేదు. అలాగని ప్రభుత్వమూ డిమాండ్ చేయడం లేదు. దీంతో కేంద్రం కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. ఏపీలో ప్రతిపక్ష పార్టీలయిన టీడీపీ , జనసేన పార్టీలు బీజేపీతో సాఫ్ట్ గా వ్యవహరిస్తున్నాయి. ఇప్పటికైతే జనసేన .. బీజేపీతో పొత్తులో ఉంది కాబట్టి కేంద్రానికి సంబంధించిన ఏ విషయంలోనూ స్పందించడం కష్టమే. తెలుగుదేశం పార్టీ కూడా బీజేపీ విషయంలో ఊరుకున్నంత ఉత్తమం మరొకటి ఉండదన్నట్లుగా వ్యవహరిస్తోంది. దీంతో ఏపీలో మోదీ పర్యటన ప్రశాంతంగా సాగుతుంది కానీ.. రాక రాక ఏపీకి వస్తున్న ప్రధాని నుంచి ఏపీకి కావాల్సిన.. రావాల్సిన అంశాలపై మాత్రం.. అడిగేవారు.. ప్రశ్నించేవారు మాత్రం ఎవరూ లేనట్లే.

# గుంటూరు గుంట రోడ్లపై పడిన కార్పొరేటర్

వైరల్ గా మారిన ఫోటో

గుంటూరు, నవంబర్ 2, ఏపీలో రోడ్ల పై విపక్షాలతో పాటు ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం అవుతుంది. రాజకీయ పార్టీలు రోడ్ల సమస్యపై ఉద్యమాలు చేస్తుంటే, సామాన్యులు కూడా తమ అవస్థలపై సోషల్ మీడియాలో వాస్తవాలను పోస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. తాజాగా గుంటూరు నగరంలో వైసీపీకి చెందిన కార్పోరేటర్ రోడ్డు మీద వెళుతూ గుంతలు పడిన రోడ్డులో కింద పడిపోయారు. దీంతో ఈ వ్యవహారం ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీకి చెందిన కార్పోరేటర్ కావటంతో ఆయన్ను కూడా జనం స్థానికంగా ట్రోల్ చేసేస్తున్నారు. రోడ్డు మీద పడిన వెంటనే ఆయన్ను స్థానికులు కొందరు పక్కకు జరిపి సహాయం చేసి సపర్యలు చేశారు. ఇంతలో మరి కొందరు స్పాట్ నుంచి ఫోటోలు తీసి సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. దీంతో గుంటూరులో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. గుంటూరు నగరంలోని పొన్నూరు రోడ్ లో ఇది జరిగింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన బాషా, గుంటూరు నగర పాలక సంస్థలో 11వ వార్డు కార్పొరేటర్ గా వ్యవహరిస్తున్నారు. ఉదయాన్నే బాషా పొన్నూరు రోడ్డు మీదగా ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుంతలో జారిపడ్డారు. శీతాకాలం అయినప్పటికీ వాతావరణంలో మార్పులు రావటంతో గుంటూరు నగరంలో తెల్లవారుజాము నుండి లైట్ గా వర్షం పడుతుంది. ఆపై రోడ్ల మీద గుంతలు కూడా ఉండటంతో వాహనం స్కిడ్ అయ్యి, కార్పోరేటర్ బాషా కింద పడిపోయారు. ఉదయం కావటంతో వాహనాల రద్దీ చాలా తక్కువగా ఉంది. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు. ఇది జరిగిన వెంటనే స్థానికంగా ఉన్న కొందరు కార్పొరేటర్ బాషాను రోడ్డు మీద నుండి పక్కకు తీసుకువచ్చి సపర్యలు చేశారు. ఇదే సమయంలో రోడ్ల దుస్థితిపై ప్రజా ప్రతినిధులు, స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవటం లేదని స్థానికులు మాట్లాడటంతో కార్పొరేటర్ బాషా నవ్వుతూ ఉండిపోయారు. తాను కూడా అధికార పార్టీలో ఉండటంతో ఏమీ మాట్లాడలేకపోయారు. కార్పొరేటర్ కూడా రోడ్డు ప్రమాదానికి గురికావటంతో స్థానికులు ఆయనను కలసి విచారం వ్యక్తం చేశారు. నేడు కార్పొరేటర్ కి ఎదురైన అనుభవం, ప్రజలకు జరగకుండా వెంటేనే రోడ్ల నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరారు. మరో వైపున గుంటూరు నగరంలో వాహనాలకు నెంబర్ ప్లేట్ లు లేకుండా ఇష్టానుసారంగా తిరిగేస్తున్నాయని స్థానికులు అంటున్నారు. తాజాగా ప్రమాదానికి గురయిన కార్పొరేటర్ బాషా వాహనానికి కూడా నెంబర్ ప్లేట్ లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంలో పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదంటున్నారు. కార్పొరేటర్ వాహనానికి కూడా నెంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్నారని, స్థానికులు కార్పొరేటర్ తోనే నవ్వుతూ చమత్కరించారు. దీనికి కూడా కార్పొరేటర్ బాషా నవ్వుతూనే తన దుస్తులకు అంటిన మట్టిని దులుపుకొని అక్కడ నుండి నిష్క్రమించారు. గుంటూరు నగరంలో అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ బాషా గుంతల రోడ్డులో పడి ప్రమాదానికి గురి కావటంతో సంఘటన ఫొటోలు చేసిన స్థానికులు వాట్సాప్, గ్రూపుల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. దీంతో ఈ ఫొటోలతో పెద్ద ఎత్తున ట్రోల్ చేస్తున్నారు. రోడ్ల దుస్థితిపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరగడంతో, రోడ్ల దుస్థితిని ట్యాగ్ చేస్తూ ప్రచారం చేస్తున్నారు.

# భారీగా తగ్గిన పత్తి ఉత్పత్తి



కడప, నవంబర్ 2, ఈ ఏడాది కూడా పత్తి దిగుబడి అంత ఆశాజనకంగా లేదు. సరిగ్గా పంట ఎదిగే సమయంలో భారీ వర్షాలు కురవడంతో పత్తికి నష్టం జరిగింది. చాలా చోట్ల మొదటి తీత పత్తి ఆగమైంది. అందుకు తోడు ఇటు భారీ వర్షాలు అటు వర్షాభావం వలన వేలాది ఎకరాల్లో గులాబీ వంటి తెగుళ్లు వ్యాపించి పంటను నాశనం చేశాయి. ఈ పరిస్థితుల రీత్యా గతేడాదికిమల్లే ఇప్పుడు సైతం పత్తి ఉత్పాదకత గణనీయంగా తగ్గుతుందని అంచనా వేశారు. బిటి రకాలొచ్చాక తమ విత్తనాలు వేస్తే ఎకరానికి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి తీయొచ్చని సీడ్ కంపెనీలు ఊదరగొడుతున్నాయి. నగటున 10-12 క్వింటాళ్ల దిగుబడి లభిస్తుందని శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు. కంపెనీలు చెప్పినట్లు 20 క్వింటాళ్లు, శాస్త్రవేత్తల అభిప్రాయం మేరకు 12 క్వింటాళ్లు ఇటీవలి కాలంలో ఎన్నడూ చూడలేదు. కాగా ఈ ఏట ఆరు క్వింటాళ్ల దిగుబడి రావొచ్చని అర్థగణాంక శాఖ తన మొదటి ముందస్తు అంచనాలో పేర్కొంది. శాస్త్రవేత్తల సగటు గణాంకాల్లోనే సగానికి సగం తగ్గించింది. నిరుడు మొదటి ముందస్తు అంచనాలో ఎకరానికి 7.15 క్వింటాళ్లొస్తాయని తెలపగా, చివరికొచ్చింది 4.70 క్వింటాళ్లు మాత్రమే. ఇవి కూడా ప్రభుత్వ సగటు లెక్కలు. వాస్తవానికి చాలా చోట్ల రైతులకు రెండు మూడు క్వింటాళ్లు రావడం గగనమైంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు అంచనా వేసిన మేరకు 6 క్వింటాళ్లు వచ్చే పరిస్థితి లేదు. ఇంకా తగ్గేలా కనిపిస్తోంది. నిరుడు ఖరీఫ్‌లో వర్షాభావం, భారీ వర్షాల వలన పత్తి పంటకు అపార నష్టం వాటిల్లింది. రైతులు ఆర్థికంగా నష్టాలు చవిచూశారు. నవ్యాంధ్ర ఏర్పడ్డాక అతి తక్కువ ఉత్పాదకత గతేడాది నమోదైంది. దిగుబడులు తగ్గడంతో చేతికొచ్చిన కొద్దిపాటి పంటకు గిరాకీ ఏర్పడి వెనకచిక్కి అమ్ముకున్న కొంత మంది రైతులకు, ముందుగానే కొని నిల్వ చేసుకున్న వ్యాపా రులకు ఆకర్షణీయమైన ధర వచ్చింది. దాంతో ఈ మారు ఖరీఫ్‌లో మెట్ట ప్రాంతాల్లోని రైతులు పత్తి తోవ పట్టారు. పత్తి పంట సాధారణ అంచనాలను మించి సాగైంది. గతంలో కొన్నేళ్లుగా సాగు చేస్తున్న ఏరియాల్లో నార్మల్ కంటే సాగు తగ్గగా, కడప, అనంతపురం వంటి ప్రాంతాలకు బాగా విస్తరించింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో నార్మల్ కంటే 9 శాతం ఎక్కువ సాగైంది. ఎపిలో వరి తర్వాత వేరుశనగ విస్తీర్ణం ఎక్కువ కాగా ఈ తడవ వేరుశనగకు సరిసమానంగా పత్తి సాగైంది. అనంతపురం వంటి చోట్ల వేరుశనగకు బదులు పత్తి వేశారు. ఈ సారి కర్నూలు, కడప, అనంతపురం, కర్నూలు, నంద్యాల, ప్రకాశంలో నార్మల్ కంటే ఎక్కువ, గుంటూరు, పల్నాడు, ఎన్‌టిఆర్ జిల్లాల్లో కొంచెం తక్కువ సాగైంది.

# ప్రభుత్వ పాఠశాలలో శవం పూడ్చారని పాఠశాల బంద్

అనంతపురం అనంతపురం జిల్లా కుందుర్పి మండలం , యర్రగుంట గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రామస్థులు మూసివేసారు. పాఠశాల స్థలానిక అక్రమంగా పట్టాదారు పాసుపుస్తకం ఇచ్చారని ఆరోపించారు. పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న వ్యక్తి, తన భార్య శవాన్ని పాఠశాల స్థలం లో పూడ్చినందుకు నీరసన తెలిసారు. .పాఠశాలకు తాళాలు వేసి నిరసన తెలిపారు. ప్రవేటు వ్యక్తులు పాఠశాలకు విక్రయించిన తర్వాతనే పాఠశాలను నిర్మించుకున్నామని, రెవెన్యూ అధికారుల తప్పిదం వల్ల నేడు గ్రామంలోని పాఠశాల వద్దె శవాన్ని పూడ్చారన్నారు. వెంటనే పాఠశాల కు అక్రమంగా ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకం రద్దు చేయాలనీ డిమాండ్ చేసారు. పాఠశాల స్థలం పరిష్కరించేంత వరకు పాఠశాల బంద్ చేస్తామని, ఇలా పాఠశాలకు కేటాయించిన స్థలంలో శవాన్ని పూడ్చడంతో విద్యార్థులు భయందోళనకు గురి అవుతున్నారని అన్నారు. సమస్య పరిస్కారమయ్యే వరకు విద్యార్థులను పాఠశాలకు పంపమని విద్యార్థుల తల్లీ తండ్రులు తెగేసి చెప్పారు...

# నల్లపురెడ్డి కంటతడి

నెల్లూరు, నవంబర్ 2,ప్రతిపక్షాలపై ఎప్పుడూ విమర్శలతో విరుచుకుపడే ఎమ్మెల్యే ప్రసన్న తనవారు అనుకుంటే చాలా జాగ్రత్తగా చూసుకుంటారని లోకల్‌గా టాక్ ఉంది. అనుచరులను ఎప్పుడూ ఆయన కుటుంబ సభ్యుల్లాగా చూసుకుంటారటని అనుచరులు చెప్పుకుంటారు. వారికి ఏ కష్టమొచ్చినా ఆదుకుంటారట. ఆ మధ్య నెల్లూరులో భారీ వర్షాలకు నష్టపోయిన కోవూరు నియోజకవర్గ ప్రజలకు కూడా ఆయన అండగా నిలిచారు. ఆయన తండ్రి నల్లపురెడ్డి శ్రీనివాసులరెడ్డి పేరు మీదుగా ట్రస్ట్ ఏర్పాటు చేసి ఆర్థిక సాయం కూడా చేస్తుంటారు ప్రసన్న. ఇటీవల కోవూరు నియోజకవర్గంలో ఇద్దరు వైఎస్సార్సీపీ కార్యకర్తలు మృతి చెందారు. ఆ ఇద్దరు కార్యకర్తలు ప్రసన్నకు బాగా ముఖ్యులు. వారి ఇంటికి పరామర్శకు వెళ్లిన ప్రసన్న కుమార్ రెడ్డి కంటతడి పెట్టుకున్నారు. బుచ్చిరెడ్డిపాలెం బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు గ్రామానికి చెందిన యాట అశోక్ కుటుంబాన్ని ప్రసన్న కుమార్ రెడ్డి పరామర్శించారు. ఆయన భార్యను ఓదార్చారు, పిల్లలకు తానున్నానంటూ భరోసా ఇచ్చారు. తన వంతుగా లక్ష రూపాయలు ఆర్థిక సాయం చేశారు. నల్లపురెడ్డి శ్రీనివాసులరెడ్డి ట్రస్ట్ ద్వారా ఈ ఆర్థిక సాయం అందించారు ప్రసన్న. ఈ క్రమంలో వారి ఇంటికి వెళ్లి పరామర్శించిన ప్రసన్న అక్కడే కంటతడి పెట్టారు. ఆ కుటుంబానికి తాను అండగా ఉంటానని చెప్పారు. బుచ్చిరెడ్డి పాలెం మండలం చల్లాయపాళెం గ్రామానికి చెందిన అత్తిపాటి గోపి కూడా ఇటీవల మరణించాడు. ఆయన కూడా వైసీపీ కార్యకర్త. గోపి కుటుంబాన్ని కూడా ప్రసన్న కుమార్ రెడ్డ పరామర్శించారు. వారి ఇంటికి వెళ్లి కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సాయం చేశారు. కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. పార్టీని, తనను నమ్ముకుని ఉన్న కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయలు ఇవ్వడమే కాకుండా, భవిష్యత్తులో ఎలాంటి అవసరం వచ్చినా తనను సంప్రదించాలని చెప్పారు ప్రసన్న కుమార్ రెడ్డి. ఆయా కుటుంబాలను పరామర్శించే క్రమంలో ప్రసన్న కుమార్ రెడ్డి భావోద్వేగానికి గురి కావడం అక్కడున్న వారిని కూడా కలచి వేసింది. ప్రసన్న కుమార్ రెడ్డి తన సహచరులకు, పార్టీ కార్యకర్తల కుటుంబాలకు ఎంత ప్రాధాన్యత ఇస్తారనడానికి ఈ ఘటనే ఉదాహరణ అని చెబుతున్నారు కోవూరు నియోజకవర్గ నాయకులు. ఎమ్మెల్యే వెంట వవ్వేరు కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి, నియోజకవర్గ నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్ రెడ్డి, మండల కన్వీనర్ సతీష్ రెడ్డి తదితరులు ఉన్నారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసన్న హుషారుగా పాల్గొంటున్నారు. ఆమధ్య గడప గడప విషయంలో సీఎం జగన్ క్లాస్ తీసుకున్న తర్వాత ఆయన ఈ కార్యక్రమానికి ప్రయారిటీ పెంచారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారికి ప్రభుత్వం తరపున అందిన సాయాన్ని తెలియజేస్తున్నారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుని సచివాలయాలకు కేటాయించిన నిధులనుంచి వాటి పరిష్కారానికి సాయం చేస్తున్నారు ప్రసన్న కుమార్ రెడ్డి.

# పాపం కుప్పం వైసీపీ కౌన్సిలర్లు....

తిరుపతి, నవంబర్ 2, ఓటుకు రూ. ఐదు వేలు పంచి గెలిచామని .. ఇప్పుడు అప్పుల వాళ్లకు వడ్డీలు చెల్లించేలా కూడా మున్సిపల్ పనులు, కాంట్రాక్టులు ఇవ్వడం లేదని ఓ కౌన్సిలర్ భర్త.. కౌన్సిల్ భేటీలోనే కమిషనర్ ముందే వాపోయారు. ఆ కమిషనర్.. అదేమిటయ్యా.. అలా అంటావు.. మొన్ననే కదా.. రూ. ఎనిమిది వందల విలవైన పనులు ఇచ్చాను. ఆ డబ్బులు కూడా నేనే ఇచ్చాను కదా అని సమాధానం ఇచ్చాడు. ఈ సమాధానం విని కౌన్సిలర్ భర్త గుండె మరింత రగిలిపోయింది. కానీ ఏం చేయగలరు ? ఆ బాధ ఆయనొక్కడిదే కాదు.. ఆ కౌన్సిల్ భేటీలో ఉన్న కౌన్సిలర్లందరిదీ. ఇంతకీ అదేం మున్సిపాలిటీ అంటే.. కుప్పం !టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవ్గం మున్సిపాలిటీలో వైఎస్ఆర్‌సీపీ గెలిచింది. అంతకు ముందు పంచాయతీగా ఉండేది. మున్సిపాలిటీగా చేశారు. కానీ మున్సిపల్ సమావేశం నిర్వహించేందుకు హాల్ లేదు. అందుకే ఓ చిన్న రూమ్‌లో మీటింగ్ ఏర్పాటు చేశారు. కౌన్సిలర్లు వచ్చారు. దాదాపు మూడేళ్లు గడుస్తున్న తమ తమ వార్డుల్లో ఇప్పటి వరకూ ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించలేక పోతున్నాంమని, తమకు వేంటనే అభివృద్ధి కార్యక్రమాలకు నగదు విడుదల చేయాలని కొందరు కౌన్సిలర్లు ప్రస్తావించారు.. ఇంతలో ఒక్కసారిగా పైకి లేచిన 17వ వార్డు వైసీపి కౌన్సిలర్ దేవకీ భర్త రంగయ్య కోపంతో ఊగిపోతూ తాము గెలిచినప్పటి నుండి నేటి వరకూ ఒక్క అభివృద్ధి పనులు చేసుకోలేక పోతున్నాంమని, ప్రజల ముందు ఎలా మొఖం చూపించాలని చెప్తూ, మున్సిపల్ కమిషనర్ తో తాము మున్సిపాలిటీ ఎన్నికల్లో ఒక ఓటుకు ఐదు వేల రూపాయలు ఇచ్చి గెలిచాంమని, కనీసం చిన్న చిన్న పనులు చేయలేక ఇబ్బందులు పడుతున్నామని, కనీసం చిన్న చిన్న పనులకు కూడా బిల్లులు ఇవ్వారా అంటూ సాక్షాత్తు కుప్పం కమిషనర్ నే వైసీపి నేత రంగయ్య నికదీశాడు. ప్రభుత్వం నుండి అభివృద్ధి పనులకు గానూ ప్రతి నెల ఇరవై వేల రూపాయలు విడుదల చేస్తోందని కమిషనర్ స్పష్టం చేశారు. వాటిని ఉపయోగించుకోవాలని ఆయన సలహా ఇచ్చారు. దీంతో కొందరు కౌన్సిలర్లు కమిషనర్‌తో వాగ్వాదం దిగారు. నాలుగు ఓట్లు కొనేందుకు రూ. ఇరవై వేలు ఖర్చు పెట్టామని..ఇప్పుడు నెలకు రూ. ఇరవై వేలు ప్రభుత్వం ఇస్తోందని చెప్పడమేమిటనేది వారి వాదన. మున్సిపల్ వైస్ చైర్మన్ అయితే ఎన్నికల్లో గెలిచేందుకు తాము అప్పులు తెచ్చామని.. అప్పులు ఇచ్చిన వారి దగ్గరకు వెళ్తే చెప్పుతో కొడతారని ఆవేధన వ్యక్తం చేశారు. వైసీపి నేత స్వయంగా మున్సిపల్ కమిషనర్ తో ఓటుకు ఐదు వేలు ఇచ్చి గెలిచాంమని చెప్పిన మాటలు ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతుంది. కుప్పం మున్సిపాలిటీలో కౌన్సిల్ సమావేశానికి మహిళా కౌన్సిలర్లు ఒక్కరు కూడా హాజరుకాలేదు. వారి భర్తలే హాజరయ్యారు. ఓటుకు రూ. ఐదు వేలు ఇచ్చి గెలిచామని చెప్పుకున్న రంగయ్య కూడా కౌన్సిలర్ కాదు. ఆయన భార్య కౌన్సిలర్. నేరుగా కౌన్సిల్ సమావేశంలోకి వారని ఆహ్వానించడం.... చట్ట విరుద్ధం. కానీ కుప్పం మున్సిపల్ కమిషనర్ మాత్రం ఇవేమీ పట్టించుకోలేదు. భార్యలకు బదులుగా భర్తలనే కౌన్సిలర్లుగా గుర్తించి సమావేశానికి రానిచ్చారు. ఇప్పుడు వారు ఎలా బయటపెట్టారో వారి గుట్టు బయట పెట్టేసుకున్నారు.




## హామీలు సరే..ఆచరణ ఏదీ

విజయవాడ, నవంబర్ 2, జగన్ ముఖ్యమంత్రి ఈ మూడున్నరేళ్లలో చేసినది ఆర్భాటంగా నిర్ణయాలు తీసుకోవడం.. వాటి పర్యవసానాలు ఎదుర్కోలేక అభాసుపాలై ఆపసోపాలు పడటం మాత్రమేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ప్రజా వేదికను కూల్చడంతో మొదలైన జగన్ విధ్వంస పాలన మూడేళ్లుగా ఎన్నో మొట్టికాయలు తిన్నా అప్రతిహాతంగా కొనసాగుతూనే ఉంది. అక్రమ కట్టడం అంటూ ప్రజావేదికనైతే కూల్చేశారు కానీ.. ఆ ప్రజా వేదిక అక్రమకట్టడం అని ఇప్పటి వరకూ అక్రమకట్టడం అని నిరూపించడం అయితే కాలేదు.ముందు కానిచ్చేస్తే.. ఆ తరువాత ఏం జరిగినా ఎవరూ పీకేదేం లేదన్న విధానంతో జగన్ సర్కార్ ముందుకు పోతోందని అంటున్నారు. రిషికొండ తవ్వకాల విషయంలో కూడా జగన్ సర్కార్ అదే తీరును అవలంబిస్తోందని గుర్తు చేస్తున్నారు. కోర్టు కూడదన్నా తవ్వకం పనులు యథేచ్ఛగా సాగించడం.. పర్యావరణ విధ్వంసానికి వెనుకాడకపోవడాన్ని ఈ సందర్భంగా రాజకీయ వర్గాలు ఉదహరిస్తున్నాయి. అడవుల విధ్వంసంపై న్యాయస్థానం కన్నెర్ర చేస్తే ధ్వంసం చేసిన అడవుల స్థానంలో మళ్లీ అడవిని పెంచుతామని ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టుకు చెప్పడాన్ని తెంపరితనంగా అభివర్ణిస్తున్నారు.విధ్వంసం విషయంలో ఒక్క అడుగు కూడా వెనక్కు వేయని జగన్.. ప్రభుత్వ నిర్ణయాల అమలు విషయంలో మాత్రం ప్రతిసారీ మడమ తిప్పుతున్నారు.. మాట తప్పుతున్నారు. ఇందుకు తాజా ఉదాహరణ విశాఖలో ఫ్లెక్సీల పై నిషేధం అంటున్నారు. ఇటీవల జగన్ విశాఖ పర్యటన సందర్భంగా విశాఖలో అపరిమితంగా అడ్డూ అదుపూ లేకుండా వెలసిన ఫెక్సీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడితో ఊరుకోకుండా తక్షణమే విశాఖలో ఫ్లెక్సీలపై నిషేధాన్ని అమలు చేసినట్లు ప్రకటించారు.ఈ తక్షణం ఇప్పటి వరకూ రాలేదు. నవంబర్ 1 లోగా ఫెక్సీలపై నిషేధం ఉత్తర్వులు ఇస్తామని ఒకసారి.. ఆ తేదీ వచ్చేసరికి నిషేధం జనవరి నుంచి అంటూ మరోసారి మడమ తిప్పేసి మాట మార్చేశారుజగన్. ముందు చూపు లేకుండా నిర్ణయాలు ప్రకటించడం.. ఆ తరువాత మిన్నకుండిపోవడం ఒక అలవాటుగా జగన్ సర్కార్ వ్యవహరిస్తున్నది. అప్పటికప్పుడు నోటికి తోచిన ప్రకటన చేయడం... ఆ ప్రకటన ప్రకారం చర్యలు తీసుకోలేక, కార్యాచరణలో పెట్టలేక అభాసుపాలు కావడం.. మాట మార్చడానికి ఆపసోపాలు పడటం ఇదే మూడున్నరేళ్లుగా జగన్ సర్కార్ అవలంబిస్తున్న విధానమంటూ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## కీలకం కానున్న కాపు నేతలు

కాకినాడ, నవంబర్ 2,వచ్చే ఎన్నికల్లో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కీలకమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. పవన్ కల్యాణ్ కు పోటీగా ముద్రగడను వైసీపీ రంగంలోకి దించబోతుందా? కాపు సామాజికవర్గం ఓట్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయా? అంటే అవుననే అనిపిస్తుంది. ముద్రగడ లేదా ఆయన కుటుంబం నుంచి ఒకరిని వచ్చే ఎన్నికల్లో పోటీకి దింపే ప్రయత్నం ఖచ్చితంగా చేస్తుందనే చెప్పాలి. కాపు సామాజికవర్గం వరస సమావేశాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ముద్రగడను తిరిగి రాజకీయ ముగ్గులోకి దింపే ప్రయత్నం జరుగుతన్నట్లే కనపడుతుంది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కాపు సామాజివకర్గం బలమైనది. పవన్ కల్యాణ్ వెంట కాపు సామాజికవర్గం మొత్తంగా నడిచే పరిస్థితులు ఉండకూడదు. ముద్రగడను, పవన్ ను పక్కన పెట్టి చూస్తే కాపు వర్గానికి బ్రాండ్ అంబాసిడర్ ఖచ్చితంగా ముద్రగడే అవుతారు. మరోవైపు వంగవీటి రంగా తనయుడు రాధా టీడీపీలో ఉన్నప్పటికీ ఆయనకు కూడా కాపు సామాజికవర్గంలో పెద్దగా ప్రాధాన్యత లేదు. ఆయనను తమ నేతగా అంగీకరించే పరిస్థితి లేదు. ఈ లెక్కలతోనే ముద్రగడ కుటుంబాన్ని వైసీపీ తరుపున బరిలోకి దించాలన్న ప్రయత్నంలో ఉన్నట్లు తెలిసింది. కన్నా లక్ష్మీనారాయణ వంటి వాళ్లు కూడా కాపు నేతగా ముద్రవేసుకునేందుకు తపన పడుతున్నారు. కాపులకు ఐదు శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కన్నా ముఖ్యమంత్రి జగన్ కు లేఖ రాశారు కూడా. ఎవరు ఎన్ని చేసినా కాపు కులంలో మాత్రం ముద్రగడకు ఉన్న ఐడెంటిటీ మరే నేతకు లేదనే చెప్పాలి. ముద్రగడకు అవసరమైతే రాజ్యసభ పదవి ఇచ్చేందుకు వైసీపీ సిద్ధంగా ఉంది. అదే సమయంలో వచ్చే ఎన్నికల్లో కాకినాడ పార్లమెంటు సీటు కావాలన్నా ఇచ్చేందుకు రెడీగా ఉంది. మరోవైపు ఆయన తాను రాజకీయాలకు దూరంగా ఉండాలని భావిస్తే ఆయన కుమారుడికి తూర్పు గోదావరి జిల్లాలో ఎమ్మెల్యే సీటు కూడా ఇచ్చేందుకు అధికార వైసీపీ మొగ్గు చూపుతుంది. ఏది కావాలో అది ముద్రగడ కుటుంబానికే ఆ పార్టీ నేతలు వదిలేసినట్లు కనపడుతుంది. చంద్రబాబు హయాంలో కాపు రిజర్వేషన్ల కోసం పోరాడిన ముద్రగడ పద్మనాభం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత మౌనంగా ఉన్నారు. కాపు రిజర్వేషన్ల ఉద్యమం నుంచి తప్పుకుంటున్నట్లు కూడా ప్రకటించారు. కానీ తన కుమారుడి రాజకీయ భవిష్యత్ కోసం ఆయన తలొగ్గే అవకాశముందన్న సూచనలు కనిపస్తున్నాయి. ఎన్నికలకు ముందు ఆయన జగన్ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించే అవకాశాలున్నాయని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల సమయంలోనే నిర్ణయం తీసుకుందామని, ముందుగా వచ్చి ఇతరులకు అవకాశం ఇవ్వకూడదన్న ధోరణిలో ముద్రగడ ఉన్నట్లు వార్తలు అందుతున్నాయి. అదే జరిగితే కాపు ఓట్లను చేజిక్కించుకునేందుకు వచ్చే ఎన్నికల్లో ముద్రగడ లబ పవన్ కల్యాణ్ గా మార్చాలన్న యత్నంలో అధికార వైసీపీ ఉంది. మరి ముద్రగడ చివరి నిమిషంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాలి. కిర్లంపూడికే పరిమితమవుతారా? లేదా కాపు కార్డుతో పాలిటిక్స్ లో సెకండ్ ఇన్నింగ్స్ ను ప్రారంభిస్తారా? అనేది చూడాల్సి ఉంది.



# మెగాకు బందరు పోర్టు

విజయవాడ, నవంబర్ 2, బందరు పోర్టు నిర్మాణం దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. తాజాగా పోర్టు నిర్మాణానికి ఎపి మారిటైం బోర్డుతో మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఒప్పందం చేసుకుంది. దీంతో ఒకటి, రెండు నెలల్లోనే పనులు ప్రారంభం అయ్యే అవకాశం ఉందని సమాచారం. ఈ దిశలోకసరత్తు వేగంగా జరుగుతోంది. నవయుగ సంస్థతో గతంలో చేసుకున్న ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడం, దీనిపై జరిగిన న్యాయ వివాదంలో ప్రభుత్వానికి అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇవ్వడం తదితర పరిణామలు తెలిసిందే. మెగాతో ఒప్పందం ఖరారు కావడంతో పోర్టు నిర్మాణ ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎపిసిజడ్ఎంఎ) ఇటీవల పరిశీలించింది. ఆ సంస్థ ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర పర్యావరణ శాఖ అనుమతుల కోసం మారిటైం బోర్డు కసరత్తు చేస్తోంది. పర్యావరణ ప్రభావ అంచనాపై ఎపి కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేసింది. మత్స్యకారుల జీవనోపాధికి సమస్యలు ఏర్పడకుండా జాగ్రత్తలు పాటిస్తూ పోర్టు నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో, నవంబర్ నెలాఖరులోపు కేంద్రం అనుమతులు లభిస్తాయని మారిటైం బోర్డు అధికారులు చెప్తున్నారు. అనంతరం భూమి పూజ చేసి పనులు ప్రారంభించే అవకాశం ఉందని అంటున్నాయి. బ్యాంకు రుణాల ద్వారా నిధులు సమకూర్చుకోవడానికి మారిటైం బోర్డు ప్రయత్నాలు ప్రారంభించింది.మొదటి దశలో పోర్టుకు సంబంధించి నాలుగు బెర్తులు నిర్మించాల్సి ఉంది. ఇందుకుగానూ ఎపి మారిటైం బోర్డు రూ.5,155.73 కోట్లతో టెండర్లు ఆహ్వానించింది. రూ.3,668.83 కోట్లతో మెగా ఇంజినీరింగ్ సంస్థ టెండరు దాఖలు చేసి ఎల్ వన్‌గా నిలిచింది. ఈ సంస్థతో మారిటైం బోర్డు ఒప్పందాన్ని పూర్తి చేసుకుంది. కేంద్ర పర్యావరణ అనుమతులు వచ్చిన తర్వాత కాంట్రాక్టు సంస్థకు డేట్ ఆఫ్ కమెన్స్‌మెంట్ (నిర్మాణ కాల పరిమితి)పై లెటర్‌ను మారిటైం బోర్డు ఇవ్వనుంది. ఒప్పందం ప్రకారం భూమి పూజ తర్వాత 30 నెలల వ్యవధిలో కాంట్రాక్టు సంస్థ నిర్మాణం పూర్తి చేయాలి.బందరు పోర్టు నిర్మాణం ఎన్నో మలుపులు తిరుగుతోంది. పోర్టు నిర్మాణం పూర్తయితే వ్యవసాయ రంగానికే పరిమితమైన ఉమ్మడి కృష్ణా జిల్లాలో పారిశ్రామికావృద్ధికీ అవకాశాలు ఏర్పడతాయని, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో 2008లో పోర్టు నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. దీని నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకున్న మైటాస్ సంస్థ రూ.100 కోట్లకుపైగా బ్యాంకు రుణాలు తీసుకుంది. నిర్మాణ పనులు ప్రారంభించకుం డానే ఆర్థికంగా మునిగిపోయింది. ఆ తర్వాత పిపిపి పద్ధతిలో నిర్మాణానికి నవయుగ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. 2019 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పనులను ప్రారంభించారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం కొద్ది రోజులకే ఆ ఒప్పందాన్ని రద్దు చేసింది. తాజాగా ఇపిసి పద్ధతిలో నిర్మాణానికి మారిటైం బోర్డు ద్వారా టెండర్లు ఆహ్వానించింది. మెగా ఇంజినీరింగ్ సంస్థతో ఒప్పందం చేసుకుంది.

# కురుస్తున్న భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి



**- అధికారులకు ఆదేశాలు ఇచ్చిన నగర కమిషనర్**

నెల్లూరు నగర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఏలాంటి విపత్కర పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు నగర పాలక సంస్థ సిద్ధంగా ఉందని కమిషనర్ హరిత తెలిపారు. భారీ వర్షాలకు నగరంలోని వివిధ ప్రాంతాలలో ప్రధాన డ్రైను మార్గాలు, ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాలు, అండర్ బ్రిడ్జ్ ల పరిస్థితిని అధికారులతో కలిసి కమిషనర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో కార్పొరేషన్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేసారు. జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు ఆదేశాల మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి బాధితుల నుంచి సమాచారం తెలుసుకుంటున్నామని తెలిపారు. వర్షాల నేపథ్యంలో సమస్యలు కలిగినవారు 18004251113,0861 230 1541 నెంబర్లకు సమాచారం అందించి తగిన సహాయం పొందాలని కమిషనర్ తెలిపారు. రహదారులు, రోడ్లు, అండర్ బ్రిడ్జ్ ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు మోటార్ల ద్వారా తోడివేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా పాదచారులు, వాహన చోదకులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ప్రధాన ప్రాంతాలలో అధికారులు పర్యవేక్షిస్తున్నారని కమిషనర్ వెల్లడించారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ప్రజలు భారీ వృక్షాల సమీపంలో నిలవడం, విద్యుత్ స్థంబాలను తాకడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని కమిషనర్ సూచించారు. వరద నీరు పెరుగుతున్న లోతట్టు ప్రాంతాల ప్రజలు కార్పొరేషన్ సూచించిన టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం అందించాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేసారు.

## ఓటీపీ ఛీటింగ్ కేసులో భాదితుడికి ఊరట

**చేజారిన నగదులకు తిరిగి ఇప్పించిన పోలీసులు**

మచిలీపట్నం ఓటిపి ఫ్రాడ్ ద్వారా మోసపోయిన బాధితునికి కృష్ణాజిల్లా పోలీసులు నగదును నష్టపోకుండా తిరిగి డిపాజిట్ చేయించారు. బ్యాంక్ కార్యకలాపాల పట్ల అప్రమత్తత లేకుంటే నష్టం తప్పదని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. .నానాటికి పెరుగుతున్న సైబర్ నేరాల బారినపడి ఎంతోమంది అమాయక ప్రజలు బలవుతున్నారు. కేవలం నిరక్షరాస్యులు మాత్రమే నష్టపోతున్నారు అనడానికి లేకుండా, విద్యావంతులు సైతం బ్యాంక్ ఎకౌంట్ అప్డేట్ అనగానే వెనుకా, ముందు ఆలోచించకుండా వారు అడిగిన సమాచారం ఇచ్చేస్తున్నారు. బ్యాంకు వారెప్పుడు వ్యక్తిగత సమాచారాన్ని అడగరని బ్యాంకు లావాదేవీల విషయంలో అప్రమత్తత లేకుంటే భారీ నష్టం ఎదుర్కోవాల్సి వస్తుందని జిల్లా ఎస్పీ జాషువా హెచ్చరించారు. ఇందులో భాగంగా తోట్లవల్లూరు మండలం గరికపర్రుకు చెందిన ఒక వ్యక్తి తన బ్యాంక్ అకౌంట్లో ఉన్న 5,13,985/- నగదును సైబర్ నేరగాళ్లు కాజేసినట్లు తోట్లవల్లురు పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా, ఆఫిర్యాదును ఎస్పీ గారి ఆదేశాల మేరకు మచిలీపట్నం జిల్లా పోలీస్ కార్యాలయంలోని సైబర్ సెల్ కు బదిలీ చేయడం జరిగింది. సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ శివాజీ, ఎస్సై పూర్ణ మాధురి సిబ్బందితో కలిసి దర్యాప్తు చేసి బ్యాంకు అధికారులను సంప్రదించి నగదు సైబర్ నెరగాళ్ళ ఖాతాలోనికి వెళ్లిన మొత్తంలో 2,67,996/- రూపాయలు తిరిగి బాధితుని ఖాతాలో డిపాజిట్ చేయించారు. కేసు వివరాల్లోకి వెళితే తోట్లవల్లూరు మండలం గరికపర్రు గ్రామానికి చెందిన సూరపనేని సుధాకర్ అనే వ్యక్తి తన కుమార్తె చదువు నిమిత్తం హెచ్డిఎఫ్సి బ్యాంకు ఆన్లైన్ యాప్ ద్వారా 45 లక్షల రూపాయలు రుణం పొందగా, తనకున్న ఎస్బిఐ అకౌంట్ నందు ట్రాన్స్ఫర్ అవుతుందని చెప్పగా ఇంటికి తిరిగి వచ్చేసాడు. తదుపరి హెచ్డిఎఫ్సి బ్యాంకు వాళ్ళ నుండి మెయిల్ కు ఎస్ఎంఎస్ రాగా, అది బ్యాంకు వారే పంపించారని అనుకొని కేవైసీ నిమిత్తం పాన్ కార్డ్ అప్లోడ్ చేయకుంటే ఎస్బిఐ అకౌంట్ నెంబర్ బ్లాక్ అవుతుందని వివరాలు ఈ లింక్ ద్వారా నిక్షిప్తపరచమని ఒక లింకును పంపించారు.ఆ లింకును క్లిక్ చేసి అడిగిన వివరాలు నమోదు చేసిన వెంటనే ఓటిపి రాగా ఓటీపీ ఎంటర్ చేసిన వెంటనే నాలుగుసార్లు దఫా దఫాలుగా మొత్తం 5,13,985/- రూపాయలు విత్ డ్రా అవ్వగా ఎస్బిఐ కస్టమర్ కేర్ నుండి ఎందుకు విత్ డ్రా చేస్తున్నారని కాల్ వచ్చిన వెంటనే బ్యాంకువారు సుధాకర్ సలహా మేరకు ఎకౌంటు బ్లాక్ చేయడం జరిగింది.వెంటనే జరిగిన నేరం గూర్చి తోట్లవల్లూరు పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేసిన వెంటనే ఎస్పీ గారి ఆదేశాల మేరకు ఆఫిర్యాదును జిల్లా పోలీస్ కార్యాలయంలోని సైబర్ సెల్ కు బదిలీ చేసారు. సైబర్ సెల్ సిబ్బంది వెంటనే దర్యాప్తు జరిపి బ్యాంకు వారిని సంప్రదించి అతని ఖాతా నుండి బదిలీ అయిన మొత్తం నగదు లోంచి 2,67,996/- రూపాయలను అతని బ్యాంకు ఖాతాలో డిపాజిట్ అయ్యేలా చేయడం జరిగింది. బ్యాంకు ఖాతాల నిర్వహణలో ఖాతాదారులు అప్రమత్తం గా ఉండాలని, ఏదైనా సైబర్ నేరాల బారిన పడితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసువారికి ఫిర్యాదు చేయాలని, తద్వారా సైబర్ నేరగాళ్ల ఆట కట్టించవచ్చని ఎస్పీ తెలిపారు.

## నేరుగా ఇంటికే తిరుమల క్యాలెండర్



తిరుమల, నవంబర్ 2, (న్యూస్ పల్స్)రుమల శ్రీవారిని దర్శించుకోవడానికి భక్తులు ఎంత ఆసక్తి చూపిస్తారో.. క్యాలెండర్లు, డైరీలను కొనుగోలు చేయడానికి అంతే ఆసక్తి చూపిస్తుంటారు. క్యాలెండర్లు, డైరీలను కొనుగోలు చేయడానికి నేరుగా తిరుమలకే వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దకే తెప్పించుకునే అవకాశం ఉందని మీకు తెలుసా.? టీటీడీ 2023 సంవత్సరానికి సంబంధించి క్యాలెండర్లు, డైరీలను అందుబాటులోకి తీసుకువచ్చింది. టీటీడీ వెబ్‌సైట్ ద్వారా క్యాలెండర్, డైరీలను బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. ఇంతకీ వీటి ధర ఎంత.? ఆన్‌లైన్‌లో ఎలా కొనుగోలు చేయాలి.? లాంటి పూర్తి వివరాలు మీకోసం..

ముందుగా తిరుమల తిరుపతి దేవస్థానములు అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి.

ఒకవేళ ముందుగానే రిజిస్టర్ అయి ఉంటే ఈమెయిల్ ఐడీ, పాస్‌వర్డ్‌తో లాగిన్ అవ్వాలి. లేదంటే రిజిస్టర్ చేసుకోవాలి.

ఇక అనంతరం రైట్ సైడ్‌లో చివర్లలో ఉండే పబ్లికేషన్స్‌లో ఉండే డైరీస్/క్యాలెండర్స్/పంచాగమ్ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి.

తర్వాత కొన్ని కండిషన్స్ కనిపిస్తాయి. దానిపై క్లిక్ చేసి అగ్రీ బటన్‌ను క్లిక్ చేయాలి.

అనంతరం షిప్పింగ్ కంట్రీని సెలక్ట్ చేసుకొని బిగ్ డైరీస్/స్మాల్ డైరీస్/క్యాలెండర్/టేబుల్ టాప్ క్యాలెండర్స్‌లో నచ్చిన వాటిని ఎంచుకోవాలి.

తర్వాత క్వాంటిటిని ఎంచుకొని ప్రోసీడ్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.

చివర్లో మీ అడ్రస్‌ను ఎంటర్ చేసి చివర్లో పేమెంట్ చేస్తే సరిపోతుంది.

ధర విషయానికొస్తే పెద్ద డైరీ రూ.150 కాగా.. చిన్న డైరీ రూ.120కు లభిస్తుంది. క్యాలెండర్ రూ.130గా ఉంది. టేబుల్ క్యాలెండర్ రూ.75తో పాటు పోస్టల్ ఛార్జీలు అదనంగా చెల్లించాల్సి వస్తుంది.

## అద్దె ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

నెల్లూరు అద్దె ఆర్టీసీ బస్సు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. తుమ్మలపెంట రోడ్డు ఆముదాల దిన్నె పెట్రోల్ బంక్ వద్ద ఘటన చోటు చేసుకుంది. అయ్యప్ప దీక్షలో ఉన్న ఇద్దరు స్వాములు భజన నిమిత్తం వెళ్తుండగా వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు వారిని ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కొల్లదిన్నె గ్రామానికి చెందిన జంపని నారాయణ మృతిచెందగా.. మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం స్థానికులు కావలి ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.ఘటనపై సమాచారం అందుకున్న పోలీసు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

## చెత్త పన్ను కోసం స్పెషల్ డ్రైవ్

**- - అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్**

నంద్యాల నంద్యాల పట్టణం లో బుధవారం నాడు చెత్త పన్ను వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్ లో భాగంగా 35 వ వార్డు సచివాలయమును ఆకస్మిక తనిఖీ చేసిన అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ .అయన మాట్లాడుతూ నంద్యాల పురపాలక సంఘము అన్నీ వార్డు సచివాలయముల పరిధి లో క్లాప్ యూజర్ చార్జీలు కలెక్షన్ కు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించుట గురించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించు తున్న ట్లు తెలిపారు .అందరూ వార్డు శానిటేషన్ సెక్రటరీలకు, అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు, ఇతర సెక్రెటరీలకు, వాలంటరీలకు, మేప్మ ఆర్ పి లకు, శానిటేషన్ మేస్త్రీలకు, క్లాప్ స్పెపల్ టీం సభ్యులకు, వార్డు నోడల్ అధికారులకు. క్లాస్ యూజర్ ఛార్జీలు కలెక్షన్ ఒక్కొక్క వార్డుకు 35 వేల రూపాయలు టార్గెట్ నిర్దేశించారు. టార్గెట్ ను పూర్తి చేసి అదే రోజు అన్ లైన్ కూడా చేయవలెనని తెలిపారు . ప్రతి సెక్రటరీ మీకు కేటాయించిన క్లస్టర్ లకు ఆ క్లస్టర్ వాలంటరీలు, ఆర్.పి.లతో కలిసి వెళ్ళి క్లాప్ యూజర్ చార్జీలు ఈ నెల వరకు వున్న పెండింగ్ మొత్తం వసూలు చేయవలెనని తెలిపారు . ప్రతి సెక్రెటరీ మరియు వాలంటీర్ వారీగా మీ వార్డు టార్గెట్ ను విభజించుకొని మీ టార్గెట్ ను పూర్తి చేయవలెనని అన్నారు .నంద్యాల లో ఉన్న 43వ వార్డ్ సచివాలయ సిబ్బంది మరియు వార్డు నోడల్ అధికారులు తప్పనిసరిగా వారికి కేటాయించిన వార్డులకు వెళ్ళి ఈ స్పెషల్ డ్రైవ్లో పాల్గొని పర్యవేక్షించి నిర్దేశించిన టార్గెట్ ను పూర్తి చేయవలెనని కోరారు . ఈ కార్యక్రమంలో 35 వార్డు అడ్మిన్ యన్. సుధాకర్. శాంటినేషన్ సెక్రటరీ .పి. అశ్వని. ఎడ్యుకేషన్ సెక్రటరీ. సుమలత. తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల భరోసా వారికి అండాదండా

**బద్వేల్ ఆర్డిఓ ఆకుల వెంకటరమణ**

బద్వేలు బాధితులకు భరోసా వారికి అన్ని విధాల అండగా బద్వేల్ ఆర్డిఓ ఆకుల వెంకటరమణ నిలిచారు బాధితులకు ఏ చిన్నపాటి కష్టం వచ్చినా భూ సమస్యలు వచ్చిన తక్షణమే వారు ఆర్ డి ఓ ను కలిసి సమస్యను చెప్పుకుంటున్నారు సమస్య పరిష్కార దిశగా ఆర్ డి ఓ చేస్తున్నారు దీంతో బాధితుల సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కారం అవుతున్నాయి బాధితుల పక్షాన ఆర్ డి ఓ ఉండడం ఎంతో సంతోషించా తగ్గ విషయం గతములో ఎప్పుడూ కూడా ఇలా జరిగి ఉండేది కాదు బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలో 12 మండలాలు ఉన్నాయి బద్వేల్ నియోజకవర్గంలో 7 మండలాలు మైదుకూరు నియోజకవర్గంలో నాలుగు మండలాలు తో పాటు కాజీపేట మండలం కూడా ఉంది ఈ 12 మండలాల్లో భూముల సమస్యలు భూముల ఆక్రమణ ఎక్కువ శాతం ఉన్నాయి ముఖ్యంగా బద్వేల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ప్రభుత్వ భూములు వేల ఎకరాల్లో ఉన్నాయి చాలా కాలంగా భూముల ఆక్రమణ లో ప్రభుత్వ భూముల కబ్జాలు నకిలీ ఇంటి పట్టాలు రెవెన్యూ సంబంధించిన పలు అంశాలు నకిలీ లాగా తయారవుతూ అధికారులకే సవాలు విసురుతున్నాయి నకిలీల బారిన ఎంతోమంది బాధితులు పడ్డారు వారిని ఎదుర్కోలేక పోలీస్ స్టేషన్లు రెవెన్యూ కార్యాలయాలు బాధితులు తిరిగి తిరిగి గతంలో విసుగుచెంది పోయారు ఆర్డీవో దృష్టికి సమస్య తీసుకు వస్తాను అంటే రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఆరు నెలల క్రితం వరకు రాజంపేటలో ఉండేది బద్వేల్ నియోజకవర్గంలోని 7 మండలాలు మైదుకూరు నియోజకవర్గం లోని బ్రహ్మంగారి మఠం మండలం రాజంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండేది బద్వేలు నియోజకవర్గ ప్రజలు రాజంపేట కు వెళ్లాలంటే దాదాపు రెండు వందల కిలోమీటర్లు ప్రయాణం చేయవలసి వచ్చేది ప్రజలకు గత కొన్ని దశాబ్దాలుగా ఇలాంటి పరిస్థితులు ఉండేవి బద్వేల్ లో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని దాదాపు 40 సంవత్సరాలుగా రాజకీయాలకు అతీతంగా నాయకులు ప్రజాసంఘాల నాయకులు వివిధ పార్టీల కార్యకర్తలు పోరాటాలు చేశారు అయినా మొదట్లో తగిన ఫలితం రాలేదు ఇక బద్వేల్ కు రెవెన్యూ డివిజన్ రాదని నాయకులు కార్యకర్తలు ప్రజాసంఘాలు నిర్ణయించుకున్న సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి ఈ సమస్య రావడం జరిగింది ఆయన వెంటనే బద్వేల్ కు రెవిన్యూ డివిజన్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు ఈ ఏడాది మార్చి 3వ తేదీ బద్వేలుకు రెవిన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయడం మొదటి ఆర్డివోగా ఆకుల వెంకటరమణ బాధ్యతలు స్వీకరించడం చక చక జరిగిపోయాయి ఆర్ డి ఓ ఆకుల వెంకటరమణ ను మొదట్లో అందరూ ఒక ప్రభుత్వ అధికారి గానే భావించారు కానీ ఆయన రామబాణం లాంటి వ్యక్తి అని ప్రజలు గుర్తించే సరికి వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి రామబాణానికి తిరిగి ఉండదు అనే నిష్ఠసత్యం అందరికి తెలిసిన విషయమే ముఖ్యంగా బద్వేలు గోపవరం పోరుమామిళ్ల బి.కోడూరు కలసపాడు అట్లూరు కాశీనాయన మండలాల్లో భూముల కబ్జాలకు భూములు ఆక్రమణకు నకిలీ పట్టాలకు కొదవలేదు బద్వేలు పోరుమామిళ్ల కేంద్రంగా చేసుకొని నకిలీ ఇంటి పట్టాల తయారీ గ్యాంగ్ చెలరేగిపోయింది ఇది కూడా అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమేఈ గ్యాంగుల బారిన పడి ఎంతోమంది బాధితులుగా మారారు మరి కొంతమంది ఆర్థికంగా మానసికంగా నష్టపోయారు వారిని ఎదుర్కొనే ధైర్యం లేక కొన్ని కోట్ల రూపాయలు నష్టపోయి ఆత్మహత్యలు చేసుకున్న వారు ఎంతో మంది ఉన్నారు వీరి విషయంలో సంబంధిత అధికారులు కూడా అంటి అంటున్నట్లు ఉండేవారు ముఖ్యంగా గత మూడు సంవత్సరాల కాలంలో నకిలీ ఇంటి పట్టాల గ్యాంగులు కబ్జాదారులు మరింతగా రెచ్చిపోయి పేదవారిపై తమ ప్రతాపాన్ని చూపించారు వారి కారణంగా ఎంతోమంది బాధితులు కట్టుబట్టలతో ఉండిపోవాల్సివచ్చింది ప్రభుత్వ భూములు కబ్జాలు భూముల ఆక్రమణలు నకిలీ పట్టాలు, చెనరేగిపోతున్న సమయంలో ఆర్డిఓ గా ఆకుల వెంకటరమణ బాధ్యతలు స్వీకరించడం జరిగింది ఆయన బాధ్యతలు స్వీకరించిన వెంటనే నకిలీ ఇంటి పట్టాలు భూముల కబ్జాలపై పూర్తిగా దృష్టిపెట్టారు బద్వేలు కేంద్రంగా నడుస్తున్న నకిలీ పట్టాల గ్యాంగ్ పై ఉక్కు పిడికిలి బిగించారు

# జోడోయాత్రకు ప్రజల ఆశీర్వాదం కావాలి - కాంగ్రెస్



చింతకొమ్మదిన్నె: నవంబర్ 2 కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ ఐక్యతను చాటేందుకు కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జూడో పాదయాత్ర విజయవంతం కావాలని కోరుకుంటూ కమలాపురం నియోజకవర్గం చింతకొమ్మదిన్నె మండల అధ్యక్షుడు బొజ్జా శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేదలకు, వృద్ధులకు, రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికిముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజలు విసిగి వేసారని, నిత్యవసరాలు ప్రజలకు అందుబాటులో లేవని, ఆవేదన చెందుతున్నారని అన్నారు. నిరుద్యోగులు నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నారు ,ఉద్యోగ అవకాశాలు కనుచూపుమేరలో కూడా కనిపించటం లేదన్నారు.రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే పరిస్థితులు లేవన్నారు. దేశ ఐక్యత కోసం, అన్ని వర్గాల సంక్షేమం కోసం దేశ సమగ్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో పాదయాత్ర ఎటువంటి అటంకాలు జరగకుండా విజయవంతం కావాలని అందుకు ప్రజల ఆశీర్వాదం, ఆశీస్సులు కోరుతున్నామన్నారు .ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్, కమలాపురం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు బొజ్జ తిరుమలేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, మండల కాంగ్రెస్ నేతలు వంశీ, పవన్, సుమతి, సాయి, పాల్గొన్నారు.

## విశాఖలో మాజీ ఉపరాష్ట్రపతి

విశాఖపట్నంవిశాఖలో భారత దేశ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనా యుడు పర్యటిస్తున్నారు.దీంట్లో బాగం గా విశాఖ ఏయూ డాక్టర్ వై.వి.ఎస్. మూర్తి ఆడిటోరియం లో నిర్వహించిన గంటి మోహనచంద్ర బాలయోగి ధర్మ నిధి ప్రసంగంలో వెంకయ్యనాయుడు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అనే అం శంపై ప్రసంగించారు.ఈ కార్య క్రమంలో పోర్టు ఛైర్మన్ కె.రామ్మోహన్రావు, ఏయూ హిందీ విభాగం విశిష్ట ఆచా ర్యులు యార్లగడ్డ లక్ష్మీప్ర సాద్ పాల్గొన్నారు.

# పిల్లర్లకే పరిమితమైన కలుగొట్ల గ్రామ స్కూల్ కాంపౌండ్ వాల్-ఏఐవైఎఫ్



ఎమ్మిగనూరు, నవంబర్ 2 ఎమ్మిగనూరు మండల పరిధిలో కలుగొట్ల గ్రామంలో ఉన్న ఎంపీపీ స్కూల్ ముందు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పాలకొమ్మ రాజీవ్ మాట్లాడుతూ ఎంపీపీ స్కూల్ కు సంబంధించి కాంపౌండర్ వాల్ నిర్మాణము మరియు గ్రామం నుండి స్కూల్ దగ్గరికి రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని 2019 ఆగస్టులో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్కూల్ పిల్లలతో పాటు గ్రామంలో రాస్తారుకో నిర్వహించడం జరిగింది స్కూల్ కు 2020 సంవత్సరంలో కాంక్రీటు రోడ్డు మరియు కాంపౌండ్ వాల్ శాంక్షన్ అయ్యాయి. 2021 ఫిబ్రవరి లో పని మొదలుపెట్టి కాంక్రీట్ రోడ్డు మాత్రమే పూర్తి చేశారు స్కూల్ కాంపౌండ్ వాల్ మాత్రము పునాది పిల్లర్ల వరకే ఆగిపోయింది స్కూలు కాంపౌండ్ వాల్ కు 15 లక్షలు అంచనా అయితే ఇప్పటివరకు 8 లక్షల 50 వేలు రూపాయలు చేతికి అందినా కూడా నిర్మాణంలో ఉన్న స్కూల్ పనులు ఆగిపోయాయి ఎంఈఓ గారిని ఆరా తీస్తే ఏవేవో కట్టుకథలు అల్లుతున్నారు ఆగిపోయిన స్కూల్ కాంపౌండ్ వాల్ పనులను వేగవంతం చేసి పిల్లలను విష పురుగులు కుక్కలు పశువుల భారీ నుండి పిల్లల ప్రాణాలు కాపాడాలని ఏఐవైఎఫ్ గా డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా తాలూకా ఉపాధ్యక్షుడు నరసింహులు నాయకులు పౌలు హుసేని రామంజి చిన్న తదితరులు పాల్గొన్నారు

## విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి :- ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మారుతి

ఎమ్మిగనూరు నవంబర్ 2 ఎమ్మిగనూరు పట్టణంలోని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. అనంతరం విద్యార్థులతో కలిసి పురవిధుల గుండా ర్యాలీ సోమప్ప సర్కిల్ లో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మారుతి మాట్లాడుతూ ఇంటర్ మరియు డిగ్రీ కళాశాలలో మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలని,ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని, పి.జి. విద్యార్థులకు శాపంగా మారిన జీ.ఓ నెం :- 77 ను రద్దు చేసి వసతి, విద్య దీవెనలు అందించాలని, ప్రమాణాలు లేని పాఠశాల బస్ లను తనిఖీ చేసి తగు చర్యలు తీసుకోవాలని డీఎస్సీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1:30 నిష్పత్తిలో ఖాళీగా ఉన్న 24 వేలకు పైగా టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ,పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని చేశాడు.విద్యారంగాన్ని గాలికి వదిలేసిన విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాడు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ బాగ్ కన్వీనర్ రవితేజ, ఉరుకుందు, కార్తీక్, బాబా మరియు అవిస్ పాల్గొన్నారు

## ఎమ్మెల్సీ చల్లా భగీరథ రెడ్డి మృతి

నంద్యాల్ :- న్యుమోనియా తో గత వారం నుండి పూర్తిగా విషమించిన ఆరోగ్యం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గచ్చిబౌలి లోని ఏఐజి హాస్పిటల్ కు తరలింపు. చికిత్స పొందుతు కోలుకోలేక మృతి చెందిన ఎమ్మెల్సీ చల్లా భగీరథ రెడ్డి ఎమ్మెల్సీ స్వగ్రామం అవుకు లో తీవ్ర విషాదం..దివంగత నేత చల్లా రామకృష్ణారెడ్డి మృతి తో భగీరథ కు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి. ఎమ్మెల్సీ చల్లా భగీరథ రెడ్డి కన్ను మూత గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఎమ్మెల్సీచల్లాభగీరథ రెడ్డి స్వగ్రామం అవుకు మండలం ఉప్పలపాడు గ్రామం. రేపు అవుకు లో అంతక్రియలు హాజరు కానున్న సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి భగీరథ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శ చేస్తారు.



# మంచికి మారుపేరు.. ప్రజలకు చిరస్మరణీయుడు బీవీ మోహన్ రెడ్డి 73వ జయంతి



గోనెగండ్ల నవంబర్ 2 అభివృద్ధిలో అజ్యుడు.. అజాత శత్రువుగా ప్రస్థానం×ఘనంగా బీవీ మోహన్ రెడ్డి జయంతి వేడుకలు ( గోనెగండ్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయం ):-తెలుగు దేశం పార్టీ సృష్టికర్త నందమూరి తారక రాముడికి ప్రీతిపరమైన వ్యక్తి.. ఎమ్మిగనూరు నియోజకవర్గమే కాదు రాష్ట్ర మంత్రిగా రెండు తెలుగు రాష్ట్రాల సుపరిచితుడు, మంచి అన్న పదానికి ఆధ్యుడు సార్ అంటే చాలు ఎవరినైనా ఆప్యాయంగా పలకరించే వ్యక్తిత్వం, ఆయనకే సొంత.. ఎంత అలకబూనినా కార్యకర్తని సైతం బుజాన చేయి వేసి మెప్పించే తత్వం విశ్వమోహనుడిది.. ఆప్యాయతలు చూపుతూ ప్రతి ఒక్కరి మదిలో చిరస్మరణీయుడవు అయ్యావు.. అభివృద్ధి చెయ్యాలంటే నీ తర్వాత ఇంకెవరైనా అని చాటి చెబుతూ ప్రాదేశిక నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచి ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్న నాయకుడు బివి విశ్వమోహనుడు. గురువారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు గోనెగండ్లలో బీవీ మోహన్ రెడ్డి 73వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీవీ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ ముందుకు పోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

## విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి :- ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మారుతి

నవంబర్ 2 బుధవారం రోజు స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలోని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. అనంతరం విద్యార్థులతో కలిసి పురవిధుల గుండా ర్యాలీ సోమప్ప సర్కిల్ లో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మారుతి మాట్లాడుతూ ఇంటర్ మరియు డిగ్రీ కళాశాలలో మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలని,ఏళ్ల తరబడి అద్దె భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని, పి.జి. విద్యార్థులకు శాపంగా మారిన జీ.ఓ నెం :- 77 ను రద్దు చేసి వసతి, విద్య దీవెనలు అందించాలని, ప్రమాణాలు లేని పాఠశాల బస్ లను తనిఖీ చేసి తగు చర్యలు తీసుకోవాలని డీఎస్సీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1:30 నిష్పత్తిలో ఖాళీగా ఉన్న 24 వేలకు పైగా టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ,పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని చేశాడు.విద్యారంగాన్ని గాలికి వదిలేసిన విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాడు

# అవతార్ 2 చుట్టూ వందల కోట్ల పందెం!

2009లో విడుదలైన 'అవతార్' వరల్డ్ వైడ్ గా కనీ వినీ ఎరుగని సంచలనాల్ని సృష్టించి ఔరా అనిపించింది. అద్భుత చిత్రాల రూపకర్త జేమ్స్ క్యామరున్ వరల్డ్ లోనే అత్యంత బెస్ట్ టెక్నాలజీతో ఈ అద్భుతాన్ని సృష్టించారు. శ్యామ్ వర్తింగ్ టన్ జోయే సాల్డానా స్టీఫెన్ లాంగ్ మిచ్చెల్ సిగోర్నీ వేవర్ ఇందులోని కీలకపాత్రల్లో నటించారు. ప్రపంచ వ్యాప్తంగా సరికొత్త రికార్డుల్ని సెట్ చేసిన ఈ మూవీ త్వరలో తన రికార్డుల్ని తానే తిరగరాయడానికి రెడీ అవుతోంది.'అవతార్' విడుదలైన ఇన్నేళ్ల తరువాత మళ్లీ ఈ మూవీకి సీక్వెల్ గా 'అవతార్ 2' రానున్న విషయం తెలిసిందే. ఈ మూవీకి మొత్తం మూడు సీక్వెల్స్ ని రూపొందిస్తున్న జేమ్స్ క్యామెరున్ డిసెంబర్ 16న 'అవతార్ 2' ని విడుదల చేయబోతున్నాడు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చక చకా జరిగిపోతున్నాయి.



సినిమా రిలీజ్ సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఇండియా వ్యాప్తంగా ఈ మూవీపై జరుగుతున్న బిజినెస్ సంచలనం సృష్టిస్తోంది.'అవతార్' విడుదలై దాదాపు 13 ఏళ్లు కావడస్తున్నా ఈ మూవీపై క్రేజ్ ఏమాత్రం తగ్గకపోవడం గమనార్హం. కొన్నేళ్ల క్రితం వరల్డ్ వైడ్ గా సంచలనం సృష్టించిన సినిమాకు సీక్వెల్గా వస్తున్న 'అవతార్ 2' పై ఎక్స్ పెక్టేషన్స్ ఫస్ట్ పార్టు మించి డబుల్ అయ్యాయి. దీంతో బిజినెస్ కూడా ఊహకందని విధంగా జరుగుతూ పలువురు ట్రేడ్ వర్గాల్లో వణుకు పుట్టిస్తోంది. ప్రస్తుతం ఇండియాలోనూ సినిమాల పరంగా మార్కెట్ పెరిగింది. దీనికితగ్గట్టుగానే 'అవతార్ 2' బిజినెల్ లెక్కలు ట్రేడ్ వర్గాలని పిచ్చెక్కిస్తున్నాయట.ఇండియాలో 'అవతార్ 2' కు జరుగుతున్న బిజినెస్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారినట్టు తెలుస్తోంది. ఒక్క తెలుగు మార్కెట్ నుంచే రూ. 100 కోట్లని మేకర్స్ ఆశిస్తున్నారట. ఇదే ఇప్పుడు మన ట్రేడ్ వర్గాలని భయాందోళనకు గురిచేస్తోందని అంటున్నారు. ఈమూవీ కున్న క్రేజ్ ని భారీ డిమాండ్ ని దృష్టిలో పెట్టుకునే చాలా వరకు మన తెలుగు సినిమాలు డిసెంబర్ 23న రావాలని ప్లాన్ చేసుకున్నాయని ఒక వేళ 'అవతార్ 2' వసూళ్ల సునామిని సృష్టిస్తే మాత్రం డిసెంబర్ 23 నుంచి రిలీజ్ అయ్యే సినిమాల పరిస్థితి మరీ దారుణంగా వుంటుందనే కామెంట్ లు వినిపిస్తున్నాయి.టాలీవుడ్ నుంచి 'అవతార్ 2' టీమ్ రూ. 100 కోట్లని ఆశిస్తుండటం కూడా ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. బిగ్ స్టార్లకే బ్లాక్ బస్టర్ లని దక్కించుకుంటే రాని మొత్తంని 'అవతార్ 2' టీమ్ కేవలం బిజినెస్ కి అడగడం ట్రేడ్ వర్గాలతో పాటు స్టార్ ప్రొడ్యూసర్లని సైతం కలవానికి గురిచేస్తోందట. అవతార్ 2' కేవలం తెలుగు బిజినెస్ కే వంద కోట్లు డిమాండ్ చేస్తున్న మేకర్స్ ఈ మూవీ గనక బ్లాక్ బస్టర్ హిట్ అనిపించుకుంటే త్వరలో రానున్న అవతార్ 2 అవతార్ 4' ల పరిస్థితి ఎలా వుంటుందో వాటి కోసం ఏ స్థాయిలో డిమాండ్ చేస్తారో ఊహించుకోవచ్చని ఇండియా వైడ్ గా 'అవతార్ 2' నుంచి ఆరు వందల కోట్లని ఆశిస్తున్నారని ఇన్ సైడ్ టాక్. మరి ఈ వందల కోట్ల పందానికి ఎవరు సై అంటూ రంగంలోకి దిగుతారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# గౌతమ్ మీనన్ హీరోయిన్ తో వున్న రిలేషన్ షిప్ ని చెప్పేశాడు!

లవ్ స్టోరీస్ స్పెషలిస్ట్ గౌతమ్ మీనన్ తెరకెక్కించిన రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'సాహసం శ్వాసగా సాగిపో'. నాగచైతన్య హీరోగా నటించిన ఈ మూవీ ద్వారా తెలుగు తెరకు పరిచయమైన బబ్లీ బ్యూటీ మంజిమ మోహన్. ఈ మూవీ తరువాత తెలుగు సినిమాల్లో కనిపించని ఈ మలయాళీ సోయగం మలయాళ తమిళ చిత్రాల్లో నటిస్తూ యమ బిజీగా వుంది. అయితే తను లవ్ లో వుందని గత కొంత కాలంగా తమిళ హీరోతో ప్రేమాయణం సాగిస్తోందంటూ వార్తలు మొదలయ్యాయి.'అభినందన' ఫేమ్ కార్తీక్ తనయుడు గౌతమ్ కార్తీక్ మంజిమ మోహన్ ప్రేమలో వున్నారంటే కోలీవుడ్ లో గత కొంత కాలంగా వరుస కథనాలు వినిపిస్తున్నాయి. దీనిపై గౌతమ్ కార్తీక్ కానీ మంజిమ మోహన్ కానీ ఎలాంటి వివరణ ఇవ్వకపోగా తమపై వస్తున్న వార్తలని ఖండించలేదు. దీంతో ఈ వార్తల్లో నిజం వుందని అంతా భావించడం మొదలు పెట్టారు. తాజాగా ఆ వార్తలని నిజం చేస్తూ తమ మధ్య వున్ బంధాన్ని సోషల్ మీడియా వేదికగా హీరో గౌతమ్ కార్తీక్ సోమవారం ఓ ఆసక్తికరమైన పోస్ట్ తో వెల్లడించి షాక్ ఇచ్చాడు.ఆసక్తికరమైన పోస్ట్ తో పాటు మంజిమ మోహన్ కలిసి వున్న ఫొటోలని షేర్ చేసి గౌతమ్ కార్తీక్ మరింత క్లారిటీ ఇచ్చాడు. 'సరైన వ్యక్తి మీ జీవితంలోకి వస్తే ఏమి జరుగుతుంది? మఈరు వారిఒపై దృష్టి పెట్టిన వెంటనే మీరు ప్రేమతో నిండిపోతారని చాలా మంది చెబుతారు. మీ గుండెలో సీతాకోక చిలుకలు ఎగురుతున్నట్టు మీ కడుపు ఆనందంతో నిండిపోయిన అనుభూతికి లోనవుతారు.మంజిమ మోహన్ మా ప్రయాణం ఖచ్చితంగా భిన్నమైనది. మేము ఎల్లప్పుడూ ఒకరినొకరు చిలిపిగా అల్లరి చేసుకోవడం.. గిల్లికజ్జాలు పడటం.. తెలివి తక్కువ విషయాలపై వాదించుకోవడంతో మా బంధాన్ని ప్రారంభించాం. మా స్నేహితులు కూడా మా వాదనలని నమ్మేవారు కాదు. ఇద్దరం కలిసి ఒక్కటిగా ప్రయాణం చేయడానికి వేచి వుండలేకపోతున్నాం' అంటూ సుధీర్ఘమైన పోస్ట్ ని షేర్ చేసి తమ బంధంపై నెలకొన్న సస్పెన్స్ కు క్లారిటీ ఇచ్చాడు.ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. గౌతమ్ కార్తీక్ మంజిమ మోహన్ ఇద్దరు కలిసి 2019లలో ఎం. ముత్తయ్య రూపొందించిన 'దేవరాట్టం'లో నటించారు. ఇదే సినిమా టైమ్ లో ఇద్దరి మధ్య మంచి బాండింగ్ కుదిరింది. అదే ప్రేమకు దారితీసిందట. అప్పటి నుంచి రహస్యంగా ప్రేమలో వున్న ఈ జంట ఎట్టకేలకు తమ ప్రేమ బంధాన్ని బటయపెట్టడం విశేషం.



# స్త్రీ - 2 తో సంచలనానికి రెడీ అయిన హీరోయిన్!

బాలీవుడ్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో అమర్ కౌశిక్ దర్శకత్వంలో తెరకెక్కిన 'స్త్రీ 'అప్పట్లో ఎలాంటి విజయాన్ని నమోదు చేసిందో తెలిసిందే. కమెడీ హారర్ లో శ్రద్ధా కపూర్ పాత్ర ఆద్యంతం ఆకట్టుకుంది. నటిగా శ్రద్ధా కపూర్ ని మరో మెట్టు పైకెక్కించిన చిత్రమది. కమర్శియల్ గా సినిమా భారీ వసూళ్లను సాధించింది. 18 కోట్లతో నిర్మించిన చిత్రం 180 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది.తాజాగా ఈ సినిమాకి సీక్వెల్ గా స్త్రీ -2ని కూడా తెరకెక్కించడానికి రంగం సిద్దమవుతుంది. శ్రద్ధా కూర్ లీడ్ రోల్ లో పార్ట్ -2ని కూడా ప్లాన్ చేస్తున్నట్లు ప్రకటించారు. తొలి భాగంలో నటించిన రాజ్ కుమార్ రావు పాత్రలో వరుణ్ ధావన్ నటించనున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది షూటింగ్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం శ్రద్ధా కపూర్ చేతినిండా సినిమాలతో బిజీగా ఉంది.ఇప్పటికే బేధియా షూటింగ్ పూర్తి చేసింది. ప్రస్తుతం ఆ సినిమా ప్రచారం పనుల్లో బిజీగా ఉంది. అలాగే లవ్ రంజన్ దర్శకత్వలో ఓ సినిమా చేయాల్సి ఉంది. ఇందులో రణబీర్ కపూర్ కి జోడీగా నటిస్తోంది. ఈ రెండు సినిమాల అనంతరం స్త్రీ -2 ప్రారంభమయ్యే అవకాశం ఉంది. తొలి భాగానికి దర్శకత్వం వహించిన అమర్ కౌశ క్ నే తెరకెక్కించనున్నారు.ఇందులో శ్రద్ధా కపూర్ పాత్రి మరింత శక్తివంతంగా మలుస్తున్నారుట. హారర్ సన్నివేశాల్ని మరింత ఆసక్తికరంగా మలిచనున్నారని తెలుస్తోంది. బాలీవుడ్ లో హారర్ సినిమాలు కూడా బాగా తగ్గాయి. బయోపిక్ లు..థ్రిల్లర్ చిత్రాలు ట్రెండ్ కొనసాగడంతో మేకర్స్ కొన్నేళ్లగా హారర్ ని టచ్ చేయలేదు. ఒకే జోనర్ లో ముందుకెళ్తున్నారు.ఈ నేపథ్యంలో 'స్త్రీ -2' పై ప్రేక్షకాభిమనుల్లో ఆసక్తి నెలకొంది. అలాగే ఇటీవలి కాలంలో బాలీవుడ్ లో హిట్ సినిమాలకు సీక్వెల్స్ మళ్లీ ఊపందుకుంటున్నాయి. బాలీవుడ్ సక్సెస్ రేట్ తగ్గిన నేపథ్యంలో మళ్లీ ఈ సినిమాలు ఇండస్ట్రీని గాడిలో పెట్టాల్సి ఉంది. అలాగే అలాగే రీమేక్ కథలకు బాలీవుడ్ లో డిమాండ్ పెరిగింది. ఒకప్పుడు సౌత్ ఇండస్ట్రీ బాలీవుడ్ వైపు చూసేది. ఇప్పుడు సన్నివేశం తారుమారైంది.



# డెల్టా ప్లస్, 3 వ వేవ్ ఆందోళనకు కారణం: లక్షణాలు ఏమిటి? టీకాలు వేయకుండా దీనిని నివారించవచ్చా?




కరోనా 2 వ వేవ్ ఇప్పుడే గడిచిపోయిందని, మరియు మనం హాయిగా పరుగెత్తవచ్చు మరియు మన పనిని మనం చేసుకోవచ్చు ప్రజలు భావిస్తున్నందున నిపుణులు డెల్టా ప్లస్ మ్యుటేషన్ వైరస్ గురించి హెచ్చరించారు. మహారాష్ట్రలో సర్వసాధారణమైన డెల్టా ప్లస్ వైరస్ 21 కేసులు మహారాష్ట్ర, కర్ణాటక మరియు మధ్య ప్రదేశ్లలో కనుగొనబడ్డాయి. ప్రపంచంలో ఇప్పటివరకు కనుగొనబడిన 200 కేసులలో 30 భారతదేశంలో కనుగొనబడ్డాయి, కాబట్టి జాగ్రత్త వహించాలి. డెల్టా ప్లస్ వైరస్ గురించి : డెల్టా ప్లస్ వైరస్ గురించి : × కొత్త కరోనావైరస్ జాతి డెల్టా ప్లస్ లేదా డెల్టా ః.1.617.2 వేరియంట్. ఇది మొదట భారతదేశంలో కనుగొనబడింది. డెల్టా ప్లస్ భారతదేశంలో 2 వ తరంగానికి కారణమైన మ్యుటేషన్ వైరస్. × ఇది ఇప్పటికే 9 దేశాలలో కనుగొనబడింది: భారతదేశం, యుకె, పోర్చుగల్, జపాన్, నేపాల్, చైనా, రష్యా, స్విట్జర్లాండ్ మరియు పోలాండ్. × మహారాష్ట్రలోని రతంగిరిలో 9, జల్గావ్‌లో 7, ముంబైలో 2, పాల్ఘర్‌లో 1, థానే, సింధుదుర్గ్ జిల్లాలో 9 కేసులు కనుగొనబడ్డాయి. కేరళ జిల్లాలోని పతనమట్ట, కద్పురాలకు చెందిన నాలుగేళ్ల బాలుడి నమూనాలను సేకరించారు. మధ్యప్రదేశ్‌లో 2-డోస్ వ్యాక్సిన్ అందుకున్న 65 ఏళ్ల మహిళలో ఈ వైరస్ కనుగొనబడింది మరియు ఇంటి ఒంటరిగా చికిత్స పొందుతోంది. మధ్యప్రదేశ్‌లో 5 మందిలో మ్యుటేషన్ వైరస్ కనుగొనబడింది, వారిలో నలుగురు మరణించారు, టీకా కోలుకున్నారు మరియు ఒకరికి టీకా అందలేదు. × కర్ణాటకలోని మైసూర్‌లో ఒక కేసు కనుగొనబడింది. కరోనా బాధితులకు 'ఈ' ప్రోటీన్ ఫుడ్ (పోషక ఆహారం) చాలా ముఖ్యం .. 2 వ వేవ్ చాలా భయంకరంగా ఉంది, 2 వ వేవ్ తరువాత 3 వ వేవ్ వస్తుందని నిపుణులు ఇప్పటికే హెచ్చరించారు. భారతదేశంలో 2 వ తరంగానికి డెల్టా వైరస్ కారణం, ఇప్పుడు వేరియంట్ డెల్టా ప్లస్. ఇది నెమ్మదిగా వ్యాపించే వైరస్. భారతదేశంలో డెల్టా ప్లస్ కేసు ఎక్కువగా రతంగిరి మరియు ఇందుసర్గలలో కనుగొనబడింది మరియు ఈ ప్రాంతంలో అధ్యయనం చేయబడుతోంది. డెల్టా వైరస్: కోవ్‌షీల్డ్ మరియు కోవాక్సిన్ పొందిన వారికి కూడా ప్రమాదకరం ఎయిమ్స్ కొత్త అధ్యయనండెల్టా వైరస్: కోవ్‌షీల్డ్ మరియు కోవాక్సిన్ పొందిన వారికి కూడా ప్రమాదకరం ఎయిమ్స్ కొత్త అధ్యయనం డెల్టా ప్లస్ లక్షణాలు డెల్టా ప్లస్ లక్షణాలు సాధారణ కోవిడ్ 19 లక్షణాలతో పాటు, కోవిడ్ 19 డెల్టా ప్లస్ ఉన్నవారిలో పొడి దగ్గు, జ్వరం, దద్దుర్లు, శ్లేష్మ నొప్పి, చర్మంపై బొబ్బలు, రంగు పాలిపోవటం, జలదరింపు మరియు వాసన ఉన్నవారిలో ఈ వైరస్ ఉందని ఒక కొత్త అధ్యయనం కనుగొంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, మాట్లాడటంలో ఇబ్బంది, కడుపు నొప్పి, యోని, రుమాటిజం, కీళ్లలో నొప్పి, వినికిడి సమస్యలు. డెల్టాప్లస్ చాలా తీవ్రమైన అనారోగ్యంతో ఉంది, మరియు దీనిని నివారించడంలో మోనోక్లోనల్ యాంటీబాడీ కాక్టెయిల్ థెరపీ ప్రభావవంతంగా ఉందో లేదో తెలుసుకోవడానికి అధ్యయనాలు జరుగుతున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**